

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే, కొంతమంది కులాల పేరుతో వివాదాలు సృష్టించాలని చూస్తున్నారు. కుల రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నాలు సరికాదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 23.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 62 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పెట్టుబడులు.. ఉద్యోగాలు.. అభివృద్ధి... ఇదే మా లక్ష్యం!






న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : పారిశ్రామికవేత్తలు ఏపీవైపు మొగ్గుచూపడానికి మూడు "ఎస్" లు ప్రధాన కారణం. స్పీడ్ (వేగం), స్టెబిలిటీ (స్థిరత్వం), సర్వీస్ (సేవ)... ఈ మూడే మా విజయ రహస్యాలు, దేశచరిత్రలోనే అతిపెద్ద ఎఫ్ డీఐ గూగుల్ డేటా సెంటర్ కేవలం 13నెలల్లో పనులు ప్రారంభించింది, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17నెలల్లో, స్వదేశీ ఫైటర్ జెట్స్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏ 37రోజుల్లో పనులు ప్రారంభించాయి, ఆ వేగమే ఆంధ్రప్రదేశ్ ను దేశంలో ప్రత్యేకంగా నిలబెడుతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్ కు అతిథిగా హాజరైన మంత్రి నారా లోకేష్ రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ ఆర్నబ్ గోస్వామి అడిగిన ప్రశ్నలకు సూటిగా, స్పష్టంగా సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే స్పష్టమైన విజన్ మా ముఖ్యమంత్రికి ఉంది. ఆయనకి ఎప్పుడూ పనులు వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు, ఆయన వేగాన్ని అందుకోవడం చాలా కష్టమేనని అన్నారు. నా ఏకైక లక్ష్యం ఉద్యోగాల సృష్టే. ఇదే నన్ను పగలు, రాత్రి నిద్రపోనివ్వకుండా మరింత కష్టపడేలా చేస్తోందని చెప్పారు.

2లో



- యువతకు అవకాశాల కల్పనే ప్రభుత్వ ప్రాధాన్యం
- దేశం గర్వించేలా ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం
- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్... ఇవే మా విజయ రహస్యాలు!
- 2028 నాటికి అమరావతిలో ప్రభుత్వ భవనాలన్నీ సిద్ధం చేస్తాం
- ఏపీకి అమరావతి ఎకనామిక్ పవర్‌హౌస్‌గా మారాలన్నదే మా లక్ష్యం
- ఐటీ, ఏఐ, క్వాంటం...అంతా చంద్రబాబే... నాడ్యూటీ ఎగ్జిక్యూషన్ మాత్రమే
- మేం ప్రాంతీయ పార్టీయే అయినా జాతీయ భావంతోనే పనిచేస్తాం
- 2047 నాటికి ఏ2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే బాబు విజన్
- రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్ లో మంత్రి నారా లోకేష్ మనోగతం

## తుంగభద్ర ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి ఎన్.ఎస్. బోసురాజు, ఎమ్మెల్యే బసవరాజు, ఎమ్మెల్సీ బసవన్న గౌడ కలిశారు. 2లో...

## మానవీయ దృక్పథంతో అర్జీల పరిష్కారం

- పీజీఆర్ఎస్‌పై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : పీజీఆర్ఎస్ సహా ప్రజల నుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే మిగతా 2లో...

## అడుగులకు ఆసరా..!

### ఐదు బోధనాసుపత్రుల్లో కృత్రిమ అవయవాల యూనిట్లు

- దివ్యాంగుల వైద్య సేవలకు అనుసంధానంగా ప్రత్యేక కేంద్రాలు
- తొలివిడతలో విశాఖ, ఒంగోలు, విజయవాడ, తిరుపతి, కర్నూలులో ఏర్పాటు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలోని ఐదు బోధనాసుపత్రుల్లో తొలిసారిగా కృత్రిమ అవయవాల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ఇతర సహాయక ఉపకరణాలను ఈ కేంద్రాల్లో తయారు చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

వైద్యుల సూచనల మేరకు దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను స్థానికంగానే అందించడం ద్వారా వారి ఖర్చులు, ప్రయాసలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై స్పందించిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిందని తెలిపారు. తొలివిడతలో ఒంగోలు, తిరుపతి, కర్నూలు, విజయవాడ, విశాఖ సర్వజన ఆసుపత్రుల్లో ఈ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన స్థలాలు, నిర్మాణాలు, ఇతర మౌలిక మిగతా 2లో...

## కొరియా రాయబారి లీ సియోంగ్ హోతో మంత్రి లోకేష్ భేటీ



న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : భారత్ లో రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) రాయబారి లీ సియోంగ్ హోను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో కొరియన్ కంపెనీల విస్తరణ, భవిష్యత్తులో ఇరుదేశాల నడుమ మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సెమీకండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, స్టోరేజ్, నౌకా నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో కొరియా ప్రపంచ అగ్రగామిగా ఉంది. భారతదేశంలో కొరియన్ కంపెనీలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదనే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు.

## ఎల్‌నినోను ధైర్యంగా ఎదుర్కొందాం

- రైతులకు ప్రతి అడుగులో అండగా ఉంటాం
- ముందస్తు ప్రణాళికలతో నష్టాలను నివారిద్దాం
- సచివాలయంలో రైతుల కోసం ప్రత్యేక సమాచార సంచిక ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

● వివరాలు 2 లో

## 80 టీఎంసీల నీటిని కాపాడాం..



- తుంగభద్ర జలాలపై కర్ణాటక ప్రతినిధులతో మంత్రి నిమ్మల చర్చలు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కర్ణాటక మాజీ మైనర్ ఇరిగేషన్ మంత్రి ఎన్.ఎస్. బోస్ రాజు, ఎమ్మెల్యే బసవరాజ్ రాయ్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవన గౌడ బదర్లి సోమవారం సచివాలయంలో కలిశారు. ఈనెల 25న జరగనున్న తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వం తరపున మంత్రికి ఆహ్వానం అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని గేట్లను ప్రారంభించనున్నారు. మిగతా 3లో...

## కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత



3

## రవాణా శాఖలో సంస్కరణలు.. పారదర్శక సేవలకు పెద్దపీట



## స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ప్రణాళికా విభాగం ఎంఓయూ

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం
- 15 శాతం వృద్ధిరేటు లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2014-19 మధ్య 13.5 శాతం మేర సీఏజీఆర్ సాధించామని.. వివిధ కారణాల వల్ల ప్రస్తుతం 11 శాతం మేర వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం-కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. మిగతా 3లో...





## దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం

- రెండేళ్లలో మేనిఫెస్టోలోని 11 హామీల్లో 10 అమలు చేశాం: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : దేవాదాయ ధర్మాదాయ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రెండేళ్ల పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన 11 హామీల్లో 10 హామీలను అమలు చేసి చూపించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయ వ్యవస్థపై జరిగిన నిర్లక్ష్యాన్ని సరిదిద్ది భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించామని చెప్పారు.

చిన్న ఆలయాల ధూపదీప నైవేద్యాల నిధులను రూ.10 వేలకు పెంచామని, రాష్ట్రంలోని 6,137 ఆలయాలకు నేరుగా నిధులు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వేద పండితుల గౌరవ వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు వెల్లడించారు. మిగతా 3లో...

# పెట్టుబడులు.. ఉద్యోగాలు.. అభివృద్ధి...ఇదే మా లక్ష్యం !

(మొదటి పేజీ తరువాయి)

కాంక్లేవ్ సందర్భంగా మంత్రి లోకేష్ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

**రిపబ్లిక్ టీవీ కాంక్లేవ్ లో ఆర్నబ్ ప్రశ్నలు - మంత్రి లోకేష్ సమాధానాలు :**

**ఆర్నబ్ గోస్వామి:** మీ నాన్నగారు కేంద్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్నప్పటి నుంచి నాకు పరిచయం ఉంది. అది బహుశా 90ల చివర్లో అనుకుంటా. అప్పట్లో మాలాంటి రిపోర్టర్లతో చంద్రబాబు గారు చాలా మంచిగా ఉండేవారు. మేం ఏదైనా అడిగేయగల చనువు ఉండేది. మా ప్రశ్నలు కాస్త విసుగు తెప్పించేలా ఉండేవి. అయినా సరే, ఆయన మా కోసం ఎప్పుడూ టైమ్ కేటాయించేవారు. మిమ్మల్ని ఈ వేదిక మీద చూస్తుంటే నాకు ఆ పాత రోజులన్నీ గుర్తొస్తున్నాయి. మీలో మీ నాన్నగారి పోలికలు కనిపిస్తున్నాయి. కొత్తతరం పాలనకు ప్రతిరూపంగా నిలుస్తున్న మీతో ఇలా వేదిక పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. లోకేష్‌ను ఇక్కడికి తీసుకురావడానికి ముఖ్య కారణం ఆయన ముమ్ముందు చాలా విజయాలు సాధించబోతున్నాడన్న నమ్మకమే. ఆయనతో మాట్లాడి ఆయన్ని అర్థం చేసుకునే అవకాశం నాకు దొరికింది. అందుకే లోకేష్, జనాలు మిమ్మల్ని ఇంకాస్త దగ్గరగా తెలుసుకోవాలి అని భావిస్తున్నాను. ఆయన చుట్టూ ఒక ప్రత్యేకమైన ఆకర్షణ (ఎక్స్-ఫ్యాక్టర్) ఉంది. ఇక్కడ ఎక్కువగా బయట కనిపించని, దేశం కోసం అద్భుతాలు చేస్తున్న వ్యక్తులు ఉన్నారు. గ్లోబల్ రేంజ్‌లో ఉన్న టీవీఎస్ కంపెనీని నడుపుతున్న సుదర్శన్ వేణు గారున్నారు, ఆయన జాతీయ వేదికల మీద పెద్దగా కనిపించరు. అలాగే జోహో ద్వారా అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీధర్ వేంబు గారున్నారు. ఐఐటీ మద్రాస్‌ను టెక్నాలజీ హబ్‌గా మార్చిన ప్రొఫెసర్ కామకోటి కూడా రాబోతున్నారు. నా దృష్టిలో వీళ్లంతా ఒకే కోవకు చెందినవాళ్లు. ఒక చిన్న ప్రశ్నతో లోకేష్‌తో సంభాషణ మొదలు పెడతాను. ఇన్ని సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్నారు, ప్రస్తుతం మీ రాజకీయ ప్రయాణం ఎలా సాగుతోంది? గడిచిన పదేళ్లను ఎలా చూస్తారు? రాబోయే పదేళ్లకు మీ విజన్ ఏంటి?

**నారా లోకేష్:** వ్యక్తిగతంగా చెప్పాలంటే, ఇదొక అద్భుతమైన ప్రయాణం. మీరు చెప్పినట్లు, ఇదొక జర్నీ మాత్రమే, డెస్టినేషన్ కాదు. నేను ఇప్పుడే ఏ స్థాయిలో ఉన్నానో చెప్పడం కరెక్ట్ కాదు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు ఉంటే నాకింకా 40-50 ఏళ్ల రాజకీయ భవిష్యత్తు ఉందని నేను నమ్ముతున్నాను. గత పదేళ్లు నాకు చాలా సంతృప్తినిచ్చాయి. ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు వచ్చినప్పుడు ఎంత బ్యాలెన్స్‌డ్‌గా ఉన్నానో, పరాజయాలను కూడా అంతే సమానంగా తీసుకున్నాను. లోకేష్ ఎప్పుడూ ఒకేలా ఉన్నాడు, అందులో ఎలాంటి మార్పు లేదు. కానీ మన దేశానికి ఇప్పుడు గొప్ప అవకాశాలు ఉన్నాయని నేను భావిస్తున్నాను. ఈ సమయంలో యువ నాయకులు ముందుకొచ్చి, బాధ్యతలు భుజానికెత్తుకుని తమ సామర్థ్యాన్ని చూపించాలి. నా రాజకీయ ప్రయాణంలో నేను చేయాలనుకుంటున్నది అదే.

**ఆర్నబ్ గోస్వామి:** మరి ఇప్పుడు మీరు ఏం చేయబోతున్నారు? మీ దృష్టంతా పని చేయించడంలోనే (ఎగ్జిక్యూషన్) ఉంటుందని గతంలో నేను మీతో మాట్లాడినప్పుడు అర్థమైంది. కాబట్టి ఇప్పుడు మీరు లక్ష్యంగా పెట్టుకున్న ఆ ఒక్క పెద్ద ప్రాజెక్ట్ ఏంటి?

**నారా లోకేష్:** నేను పని చేస్తున్న ప్రాజెక్టులు చాలానే ఉన్నాయి. కాబట్టి ఒకటే ప్రాజెక్ట్ అని చెప్పలేను. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే స్పష్టమైన విజన్ మా ముఖ్యమంత్రికి ఉంది. ఆయనకి ఎప్పుడూ పనులు వేగంగా జరిగిపోవాలి. అలాంటి బాస్ ఉన్నప్పుడు, ఆయన వేగాన్ని అందుకోవడం చాలా కష్టమే. కానీ నేను ఆ ప్రయత్నంలోనే ఉన్నాను. ప్రస్తుతం నేను రెండు ముఖ్యమైన శాఖలు చూస్తున్నాను. ఒకటి భారత్ పోర్ట్‌ఫోలియో (విద్య), రెండోది ఇండియా పోర్ట్‌ఫోలియో (పెట్టుబడులు ఆకర్షించడం, ఉద్యోగాల సృష్టి). ఈ రెండింటిలోనూ నేను చేస్తున్న పని ఏపీని మిగతా రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెడుతుంది, అలాగే దేశానికి ఒక కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేస్తుంది.

**ఆర్నబ్ గోస్వామి:** మరి మీ బాస్ మీకు పెట్టిన టార్గెట్ ఏంటి?

**నారా లోకేష్:** ఆయన ఆలోచన చాలా క్లియర్. మనం 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలి. అంటే.. మనం ఏటా 15% (సీఏజీఆర్) వృద్ధి సాధించాలి. దీనికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి నేనే ఛైర్మన్‌ను. కాబట్టి, ఇప్పుడు నా ఏకైక లక్ష్యం ఉద్యోగాల సృష్టే. ఇదే నన్ను పగలు, రాత్రి నిద్రపోనివ్వకుండా మరింత కష్టపడేలా చేస్తోంది.

**ఆర్నబ్ గోస్వామి:** ఇందాక అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వచ్చారు, అందరూ పెట్టుబడుల గురించే మాట్లాడుతున్నారు. అసలు పెట్టుబడులు పెట్టడానికి ఏపీకి ఉన్న ప్రత్యేకత ఏంటి?

**నారా లోకేష్:** నేను మూడు 'S'ల గురించి చెబుతాను. పారిశ్రామికవేత్తలు ఏపీవైపు



మొగ్గుచూపడానికి మూడు "ఎస్" లు ప్రధాన కారణం. స్పీడ్ (వేగం), స్టెబిలిటీ (స్థిరత్వం), సర్వీస్ (సేవ)... ఈ మూడే మా విజయ రహస్యాలు, దేశచరిత్రలోనే అతిపెద్ద ఎఫ్ డీఐ గూగుల్ డేటా సెంటర్ కేవలం 13నెలల్లో పనులు ప్రారంభించింది, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ 17నెలల్లో, స్వదేశీ ఫైటర్ జెట్స్ తయారీ ప్రాజెక్టు ఏఎంసీఏ 37రోజుల్లో పనులు ప్రారంభించాయి, ఆ వేగమే ఆంధ్రప్రదేశ్ ను దేశంలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. రెండోది స్టెబిలిటీ. మా నాయకుడికి ఒక మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆయన తీసుకొచ్చిన విధానాలు ఎప్పటికీ ఏపీని ప్రత్యేకంగా నిలబడతాయి, మేం వాటిని అమలు చేసి చూపించాం కూడా. మూడోది సర్వీస్. వ్యాపారవేత్తలను నేను దేశ నిర్మాతలుగా చూస్తాను. వారు ఉద్యోగాలు ఇస్తారు, దేశాన్ని నిర్మిస్తారు. రాజకీయ నాయకుడిగా మీకు సేవ చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నదే నా ఉద్దేశం. ఈ మూడు 'స' లే ఏపీని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా చూపిస్తున్నాయి. అందుకే ఈరోజు దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25% కేవలం ఏపీకే వస్తున్నాయి. ఇది ఏపీని దేశంలోనే ప్రత్యేకంగా నిలబెడుతోంది.

**ఆర్నబ్ గోస్వామి:** అప్పటికీ ఇప్పటికి వ్యాపారానికి, రాజకీయాలకు మధ్య ఉన్న సంబంధంలో వచ్చిన మార్పేంటి? మీ జనరేషన్ వాళ్లు దీన్ని ఎలా చూస్తున్నారు? అప్పట్లో ఉన్నట్లు ఇప్పుడు పరాన్న జీవిత్వం, ఆశ్రిత పక్షపాతం లేవు. కేవలం పనితీరు (పెర్ఫార్మన్స్) మీదే ఆధారపడి ఉంది కదా?

**నారా లోకేష్:** అవును అర్నాబ్ జీ, ఒక నాయకుడితో 15-20 ఏళ్లు కలిసి ప్రయాణించాక, మనమంతా ఆయనకు కార్బన్ కాపీలా మారిపోతాం. ఆ వర్క్ కల్చర్ మనకూ వస్తుంది. మేం ప్రాంతీయ పార్టీ అయినా ఎప్పుడూ దేశం గురించే ఆలోచించాం. మా విధానాల వల్ల దేశానికి లాభం చేకూరింది. వ్యాపారవేత్తలు దేశ నిర్మాతలు, వాళ్లు జాబ్స్ ఇస్తారు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ నిర్మిస్తారు. అయితే, వాళ్ల పెట్టుబడుల కోసం ఏపీ మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలూ పోటీ పడుతున్నాయి. నేను మాత్రం నా మూడు 'స'లతో వాళ్లను ఆకర్షిస్తున్నాను. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న సంస్థలు చాలా పెద్దవి, వాళ్లకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం కావాలి. నేను చేస్తోంది అదే. వాళ్ల ప్రాజెక్ట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తాను. ఎందుకంటే వాళ్లు పెట్టుబడులు పెడితేనే మా దగ్గర ఉద్యోగాలు వస్తాయి, స్థానికంగా ఆర్థిక వృద్ధి జరుగుతుంది.

**ఆర్నబ్ గోస్వామి:** నాది మరొక సూటి ప్రశ్న ఉంది. ఎన్డీయేలో మీరే అత్యధిక ఎంపీలున్న మిత్రపక్షం కాబట్టి, మీకు ఢిల్లీలో స్పెషల్ ట్రీట్‌మెంట్ దొరుకుతోందన్న ప్రచారం ఉంది. ఇది నిజమేనా? ఇంకో విషయమేంటంటే.. అమరావతికి నిధులన్నీ కేంద్రం నుంచే వస్తున్నాయని ఢిల్లీలో ఒక టాక్ ఉంది. కానీ అది నిజం కాదని, రాష్ట్రమే సొంతంగా నిధులు సమకూర్చుకుందని నేను విన్నాను. దీనిపై మీరు క్లారిటీ ఇస్తారా?

**నారా లోకేష్:** అర్నాబ్ జీ, ఎక్కువ మంది ఎంపీలు ఉంటే మన మాట గట్టిగా వినిపించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. కానీ దానివల్ల రాష్ట్రానికి, నాకు ఏం లాభం కలిగింది? ప్రధానితో కలిసి డిన్నర్ చేసే అవకాశం దొరికింది. మోదీ గారు చాలా ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారు. ఆయన విజన్ ఏంటో నాకు అర్థమైంది. కేంద్రం అద్భుతమైన పాలసీలు తీసుకొస్తోంది. ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు, కానీ ఆచరణలో పెట్టాల్సింది రాష్ట్రాలే. ఆ విషయంలో ఏపీ మిగతా రాష్ట్రాల కంటే చాలా వేగంగా ముందుకెళ్తోంది, అందుకే మాకు తగిన గుర్తింపు వస్తోంది. ఇతర రాష్ట్రాలు సైలెంట్‌గా ఉన్నప్పుడు, నేను డిఫెన్స్ మినిస్టర్ దగ్గరికి వెళ్లి 'మాకు ప్రాజెక్ట్ ఇవ్వండి, మా దగ్గర భూమి రెడీగా ఉంది' అని అడిగితే ఆయనెందుకు కాదంటారు? 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమి ఇచ్చాం, దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అదే మా స్పీడ్. ప్రధాని కూడా ఇలా స్పీడ్‌గా పనిచేసే రాష్ట్రాల వైపే చూస్తున్నారు. రాష్ట్రాలు పోటీ పడితేనే దేశం గెలుస్తుందని నా నమ్మకం. అమరావతి విషయానికొస్తే.. ప్రాజెక్ట్ మొదలు పెట్టడానికి వాళ్లు మొదట 12-13 వేల కోట్ల స్టార్టప్ క్యాపిటల్ ఇచ్చారు. కానీ అది కేవలం ప్రారంభం మాత్రమే. మేమే సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నాం. ఇదొక సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. దేశం గర్వపడేలా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తున్నాం. ఇకపై మనం విదేశాల్లోని నగరాల గురించి కాదు, ఇండియాలోని అమరావతి గురించే మాట్లాడుకుంటాం. అదే మమ్మల్ని మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**ఆర్నబ్ గోస్వామి:** స్టార్టప్ క్యాపిటల్ కాకుండా మీరెంత ఫండ్స్ రైజ్ చేశారు? ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి మీకున్న పట్టుదల, దానికి పెట్టుకున్న టైమ్‌లైన్ గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను. ఎన్నికల కోసమే రాజకీయ నాయకులు పనులు పూర్తి చేస్తారన్న విమర్శలు ఉంటాయి కదా, దానిపై మీరేమంటారు?

**నారా లోకేష్:** మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. ప్రాజెక్టులన్నీ రీస్టార్ట్ చేసినందున, మేం ప్రధానికి ఓ మాట ఇచ్చాం. 2028 నాటికి అమరావతిలోని అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు లాంటి ప్రభుత్వ భవనాలన్నీ సిద్ధం చేస్తాం. ఇది మేం ఇచ్చిన మాట, కచ్చితంగా నిలబెట్టుకుంటాం. ఇక రాజధాని కోసం 60వేల కోట్లు సేకరించబోతున్నాం. కేవలం ప్రభుత్వ భవనాలే కాదు. ఇప్పటికే బిట్స్ (దీ ఋూ) వాళ్లు తమ క్యాంపస్ నిర్మిస్తున్నారు, వచ్చే ఏడాది అడ్మిషన్లు కూడా స్టార్ట్ అవుతాయి. వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఆసుపత్రులు, హోటళ్లు, ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్స్ అన్నీ వస్తున్నాయి. అమరావతి కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఏపీకి ఒక ఆర్థిక శక్తిగా (ఎకనామిక్ పవర్‌హౌస్‌గా) మారాలన్నదే మా లక్ష్యం. నేను ఇందాక చెప్పిన 2.4 ట్రిలియన్ ఎకానమీ అనేది ఒకే నగరంతో సాధ్యం కాదు. అందుకే విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను వేర్వేరు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖను ఐటీ, డేటా సెంటర్లకు కేరాఫ్‌గా మార్చుతున్నాం. అమరావతిలో క్వాంటం ఎకోసిస్టమ్ డెవలప్ చేస్తున్నాం. ఇక రాయలసీమ (తిరుపతి ప్రాంతం) లో మాన్యుఫ్యాక్చరింగ్ (తయారీ) రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రాజధాని అమరావతే అయినా, మిగతా రాష్ట్రాన్ని కూడా సమానంగా అభివృద్ధి చేస్తున్నాం.

**నిరంజన్ (వ్యాఖ్యాత):** లోకేష్ గారూ, జస్ట్ క్యాజువల్‌గా అడుగుతున్నా. గతంలో మేం మాజీ ముఖ్యమంత్రిని పిలవడానికి వైజాగ్ వెళ్లినప్పుడు, అక్కడి రోడ్లు చాలా ఘోరంగా ఉన్నాయి. కొత్త రాజధానులు కట్టే హడావుడిలో అసలు విషయాలు మర్చిపోయారు. ఇంకో విషయం ఏంటంటే, ఎన్డీయే-1 సమయంలో ఉన్న టీడీపీకి, ఇప్పటి టీడీపీకి చాలా తేడా ఉంది. అప్పట్లో మీ ఎంపీలు చాలామంది వయసు పైబడిన వాళ్లు, వివాదాలు కూడా ఉండేవి. కానీ ఇప్పుడు మీ ఎంపీలు చాలా యంగ్‌గా ఉన్నారు. 40 ఏళ్ల వాళ్లే ఇక్కడ యూత్ లీడర్స్ అని చెప్పుకుంటుంటే, మీ ఎంపీల్లో 30 ఏళ్ల వారు ఉన్నారు. పార్టీలో మార్పుకోసం ఇది మీరు కావాలని చేస్తున్న పనా? దీని వల్ల మీకు వర్కౌట్ అవుతోందా?

**నారా లోకేష్:** ఏ రాజకీయ పార్టీకైనా కొన్ని మార్పులు తప్పవు. మా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గారు పార్టీ పెట్టినప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. వాళ్లు 40 ఏళ్ల పాటు పార్టీని నడిపించారు. ఇప్పుడు కొత్త తరం నాయకత్వం రావాలని వాళ్లే చాలాసార్లు చెప్పారు. మేం ఆ మార్పే చేశాం. గత ఎన్నికల్లో గెలిచిన మా ఎమ్మెల్యేల్లో 50% మంది, మంత్రుల్లో 17 మంది ఫస్ట్ టైమర్లే. మన దేశంలోనే అత్యంత పిన్న వయస్కులైన పార్లమెంటరీ బృందం మాదే. రామ్మోహన్ నాయుడు చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన క్యాబినెట్ మంత్రి. యువత ఆకాంక్షలు రాజకీయాల్లో ప్రతిబింబించాలంటే ఈ మార్పు చాలా అవసరం. మేం ప్రాంతీయ పార్టీయే అయినా జాతీయ భావంతోనే పనిచేస్తాం.

**నిరంజన్ (వ్యాఖ్యాత):** మీ నాన్నగారు ఏపీకి 'ఐటీ' ని పరిచయం చేసిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన చాలా ప్రోగ్రెసివ్ అని అందరికీ తెలుసు. ఇప్పుడు మీరు కూడా అదే దారిలో 'ఏఐ' ని ప్రమోట్ చేస్తున్నారు. చంద్రబాబు గారు ఐటీ అయితే, లోకేష్ ఏఐ అన్నమాట. ఇది మీ ప్లాన్ ప్రకారం జరుగుతోందా? మీకు ఇదెంత ముఖ్యం?

**నారా లోకేష్:** మా ముఖ్యమంత్రి గురించి తెలిసిన వాళ్లకి అర్థమవుతుంది, ఆయన మా కోసం క్రెడిట్ ఏమీ వదిలిపెట్టరు. ఐటీ ఆయనే, ఏఐ ఆయనే, క్వాంటం కూడా ఆయనే. ఆయన నాకేం వదిలిపెట్టలేదు. కానీ నా డ్యూటీ ఏంటంటే, ఆయన చూపించిన దారిలో పనులు అమలు చేయడం (ఎగ్జిక్యూషన్). ఆయనొక బ్రాండ్, ఆ బ్రాండ్ వల్లే మాకు గూగుల్ లాంటి పెద్ద కంపెనీల తలుపులు తెరుచుకున్నాయి. నేను ఆ బ్రాండ్‌ను వాడుకున్నాను, ప్రాజెక్ట్ తీసుకొచ్చాను. ఇప్పుడు పనులు జరుగుతున్నాయి, ఏడాదిలోపు ఆ డేటా సెంటర్‌ను దేశానికి అంకితం చేస్తాం. అదే మమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఇప్పుడు నాయుడు గారి 4.0 (నాలుగోసారి సీఎం) పాలన నడుస్తోంది. ఆయన మొదటి మూడు టర్మ్స్ కంటే ఇది పూర్తిగా డిఫరెంట్. నేను సరదాగా మా యువ బృందంతో అంటుంటాను.. 'నాయుడు గారు ఎప్పుడూ 1995 నాటి తన టీమ్ గురించి గొప్పగా చెబుతుంటారు కదా, రేపొద్దున ఆయన 2024 టీమ్ ఇంకా అద్భుతం రా అని మన గురించి చెప్పుకునేలా మనం కష్టపడి పనిచేయాలి' అని. అదే మమ్మల్ని పగలు, రాత్రి కష్టపడేలా ముందుకు నడిపిస్తోంది.

**ఆర్నబ్ గోస్వామి:** చాలా ఇంట్రెస్టింగ్ సెషన్ ఇది. లోకేష్ గారూ, ఇండియాలో అందరూ ఆసక్తిగా గమనిస్తున్న సెకండ్ జనరేషన్ లీడర్ మీరు. మీ నాన్నగారి నీడలో నుంచి బయటికొచ్చి, టెక్నాలజీ తెలిసిన లీడర్‌గా మీకంటూ ఒక ఇమేజ్ క్రియేట్ చేసుకున్నందుకు కంగ్రాట్స్. ఏపీని డేటా సెంటర్లకు కేరాఫ్‌గా మారుస్తున్నారు కదా. కానీ వీటికి కరెంటు, నీళ్లు చాలా అవసరం. దీనివల్ల స్థానికులకు ఇబ్బంది కలగొచ్చు కదా. మరి ఈ సమస్యను ఎలా బ్యాలెన్స్ చేస్తారు? భవిష్యత్తు కోసం ఇప్పుడే ఏమైనా ప్లాన్ చేస్తున్నారా?

**నారా లోకేష్:** అర్నాబ్ జీ, ఈ డెవలప్‌మెంట్‌లో రైతులను, స్థానికులను భాగస్వాములను చేయడం చాలా ముఖ్యం. వాళ్లకు వాస్తవాలు వివరించాలి. ఉదాహరణకు, డేటా సెంటర్లకు నీళ్లు కావాలి నిజమే. కానీ ప్రతి ఏటా గోదావరి నుంచి 3వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఈ నీళ్లు బ్రెజిల్ లేదా వియత్నాం దేశమంతా ఏడాది పాటు వాడే నీటితో సమానం. డేటా సెంటర్ లకు అడుగుతున్నది కేవలం 1.5 టీఎంసీలే. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యాక ఈ నీటిని వాడుకుంటాం. రెండోది, పవర్ విషయానికొస్తే మన దేశంలో 'వన్ గ్రిడ్' విధానం ఉంది. మా ఏపీ దక్షిణ ప్రాంతంలో చాలా సోలార్, విండ్ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి డేటా సెంటర్లకు పవర్ ఇచ్చుకోవచ్చు. అలాగే, ఏఐ విషయంలో మనదేశానికి సొంత ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఉండాలి, లేకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బంది పడతాం.

**ఆర్నబ్ గోస్వామి:** దీని కోసం మీరు ఇప్పుడే ప్రిపేర్ అవుతున్నారా?

**నారా లోకేష్:** కచ్చితంగా. ఏపీలో ఈ ఏడాది పవర్ వాడకం ఏకంగా 17% పెరిగింది. దేశంలో ఇదే హయ్యెస్ట్. దీనికి తగ్గట్లు మేం ప్లాన్ చేసుకోవాలి. ప్రాజెక్టులన్నీ గ్రౌండింగ్ కాకముందే మేం ఇంత స్పీడ్‌గా వెళ్తున్నాం అంటే, ఫ్యూచర్ కోసం పవర్, వాటర్ ఎలా మేనేజ్ చేయాలో ఇప్పుడే ప్లాన్ చేసుకుంటున్నాం. మా మంత్రులంతా దీనిపైనే ఫోకస్ చేస్తున్నారు.

**ఆర్నబ్ గోస్వామి:** ఇక్కడో చిన్న కాంట్రాడిక్షన్ ఏంటంటే, గతంలో పాలిటిక్స్ అంటే ఓటర్లను బుజ్జగించడమే. కానీ మీరు రియల్-టైమ్ గవర్నెన్స్ అంటారు. మీ దగ్గర ఒక ఫైటర్ జెట్ కాక్‌పిట్ లాంటి డ్యాష్‌బోర్డ్ ఉందని విన్నాను. ఇదంతా నిజంగా పాజిబుల్ అవుతుందా? లేక ఇదొక అట్రాక్టివ్ మార్కెటింగ్ పదమా? సగటు మనిషికి దీనివల్ల యూజ్ ఏంటి?

**నారా లోకేష్:** ఒక ఆసక్తికరమైన నిజం చెబుతాను వినండి. 2024లో మేం అధికారంలోకి వచ్చేనాటికి ఏపీలో అక్షరాస్యత రేటు చాలా దారుణంగా ఉంది. ఐటీలో అంత పేరున్న రాష్ట్రంలో ఇలా జరగడం విచిత్రం కదా? ఎందుకంటే, గత ఐదేళ్లలో పాలకులు అసలు మానిటరింగ్ చేయలేదు. డ్రాపౌట్స్ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు, విద్యా శాఖ మంత్రి ఒక డేటాను ఎలా చూస్తారో, గ్రౌండ్ లెవెల్‌లో ఉన్న హెడ్‌మాస్టర్ కూడా అదే డేటాను చూస్తారు. దీనివల్ల రిజల్ట్స్ వస్తున్నాయి. ఈ ఏడాదే దాదాపు 85,000 మంది ప్రైవేట్ స్కూల్స్ నుంచి గవర్నమెంట్ స్కూల్స్‌కి వచ్చారు. ఈ డేటా ఉంటేనే నేను కరెక్ట్ డెసిషన్స్ తీసుకోగలను. ఏ స్కూల్‌లో, ఏ సబ్జెక్టులో ఎవరు వీక్ ఉన్నారో నాకు అమరావతిలో కూర్చుంటే తెలిసిపోతుంది. ప్రైవేట్ సెక్టార్ చేయగలిగినప్పుడు గవర్నమెంట్ ఎందుకు చేయకూడదు? నా దగ్గర అగ్రికల్చర్, వాటర్ మేనేజ్‌మెంట్.. ఇలా అన్ని శాఖల డేటా ఉంటుంది. దాన్ని బట్టే మేం పక్కా ప్లానింగ్‌తో ముందుకెళ్తున్నాం.

**ఆర్నబ్ గోస్వామి:** మీరు స్టాన్‌ఫోర్డ్ వెళ్లాక రాజకీయాల్లోకి రావాలని డిసైడ్ అయ్యారా?

**నారా లోకేష్:** స్టాన్‌ఫోర్డ్ వెళ్లకముందే నాకు పాలిటిక్స్‌లోకి రావాలని ఆసక్తి ఉంది. స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ ఎందుకు చేయాలనుకుంటున్నానో వ్యాసం రాయమని అడిగినపుడు ఈ విషయం ప్రస్తావించాను. ప్రైవేట్ సెక్టార్ నుంచి పబ్లిక్ సెక్టార్‌కి మారేందుకు ఈ ఎంబీఏ నాకు యూజ్ అవుతుందని రాశాను. చాలామంది నన్నీ ప్రశ్న అడుగుతుంటారు. 2004 ఎన్నికల్లో నాయుడు గారు ఎన్నికల్లో ఓడిపోయారు. సరిగ్గా ఏడాది తర్వాత ఆయనతో కలిసి ఓ పెళ్లికి వెళ్లాను. అక్కడ దాదాపు 5,000 మంది ఉన్నారు. నాయుడు గారు లోపలికి రాగానే, అక్కడ ఉన్న వారంతా లేచి నిలబడి ఆయనకు రెస్పెక్ట్ ఇచ్చారు. అప్పుడే నాకు అర్థమైంది, ఇంతటి గౌరవం దక్కేది రాజకీయాల్లోనే అని. అదే నన్ను రాజకీయాల వైపు నడిపించింది.

**ఆర్నబ్ గోస్వామి:** నిజం చెప్పాలంటే ఆ గౌరవానికి ఆయన కచ్చితంగా అర్హులు. అందరు నాయకులకూ ఆ రెస్పెక్ట్ దక్కదు. నాకైతే ఈ సంభాషణ చాలా బాగా అనిపించింది. మీలో చాలా పాజిటివిటీ ఉంది. ముందు ముందు మీరు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. భవిష్యత్తులో దేశం కచ్చితంగా చూడాల్సిన నాయకుడు నారా లోకేష్. థ్యాంక్ యూ సో మచ్, నారా లోకేష్‌గారూ.

## అడుగులకు ఆసరా..!



(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలపై కేంద్ర బృందాలు సోమవారం నుంచి పరిశీలన ప్రారంభించాయని మంత్రి తెలిపారు.

బోధనాసుపత్రుల్లోనే సదరం కింద 21 రకాల దివ్యాంగ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నందున, ఈ యూనిట్ల ఏర్పాటు ద్వారా దివ్యాంగులకు వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని చెప్పారు.

**27 జిల్లాల్లో కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన :** రాష్ట్రంలోని 27 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఒకటి చొప్పున కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని మంత్రి తెలిపారు. దీనిని పరిశీలించిన కేంద్రం తొలివిడతగా ఐదు బోధనాసుపత్రుల్లో యూనిట్ల ఏర్పాటుకు అంగీకరించిందన్నారు.

కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి దివ్యాంగ వయోశ్రీ పథకం కింద 102 తయారీ కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటికి అదనంగా 2030 నాటికి మరో 300 కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందన్నారు.

మహిళా, శిశు అభివృద్ధి, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు మధ్య జరిగిన చర్చల అనంతరం భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రత్యేక బృందాలు ఆసుపత్రులను పరిశీలిస్తున్నాయని వెల్లడించారు.

**కొలతల నుంచి అమరిక, మరమ్మతుల వరకు సేవలు :** ఈ తయారీ యూనిట్లలో దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయి సేవలు అందించనున్నారు. కొలతలు తీసుకోవడం, కృత్రిమ అవయవాల తయారీ, అమరిక, అవసరమైన మరమ్మతులు చేయడం వంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి.

అత్యాధునిక క్లినికల్ మెజర్‌మెంట్ విధానాలతో ప్రతి రోగికి సరిపోయేలా ప్రత్యేక అచ్చులను రూపొందిస్తారు. థర్మోప్లాస్టిక్ పదార్థాలను వాక్యూమ్ ఫార్మింగ్ పద్ధతిలో మలిచి సౌకర్యవంతమైన సాకెట్లు, సహాయక పరికరాలను తయారు చేస్తారు.

కాళ్లు, చేతులకు అమర్చే కృత్రిమ అవయవాలు, స్ప్లింట్లు, కాలిపర్లు, వెన్నెముకకు మద్దతు ఇచ్చే బ్రేస్‌లను అవసరానికి అనుగుణంగా రూపొందిస్తారు. లబ్ధిదారులకు కచ్చితమైన అమరికతో పాటు నడక శిక్షణ, పునరావాస సేవలు కూడా అందించనున్నారు.

## మానవీయ దృక్పథంతో అర్జీల పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

**పాత కేసుల ట్రేసింగ్ :** "రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తుంగభద్ర ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఈ నెల 25న జరగనున్న తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారితో ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

## ఎల్‌నినోను ధైర్యంగా ఎదుర్కొందాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో ఎల్‌నినో రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక సూచనల ద్వారా రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సచివాలయంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం" అనే ప్రత్యేక సమాచార సంచికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధించిన సమగ్ర సూచనలను ఈ



సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించి దిగుబడులను కాపాడుకోవచ్చన్నారు.

వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, సహకార శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలను అమలు చేస్తున్నాయని మంత్రి వెల్లడించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ హెచ్చరికలు, పంటల నిర్వహణ సూచనలు గ్రామ స్థాయి వరకు చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వాతావరణ నిపుణుల సూచనల ఆధారంగా రూపొందించిన ఈ ప్రత్యేక సంచిక రైతులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పంటల వారీగా, ప్రాంతాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పద్ధతులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే వ్యవసాయ నిర్వహణ చర్యలు ఇందులో పొందుపరచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి వాతావరణ సవాళ్లు ఎదురైనా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రత్యేక సమాచార సంచిక ద్వారా రైతులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకొని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 80 టీఎంసీల నీటిని కాపాడాం..



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు కర్ణాటక ప్రతినిధులతో అంతర్రాష్ట్ర జలవనరుల అంశాలపై చర్చించారు. 2024లో వచ్చిన భారీ వరదల సమయంలో తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన ఘటనను గుర్తు చేస్తూ, తక్షణ చర్యలతో స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు చేసి 80 టీఎంసీల నీటిని కాపాడినట్లు తెలిపారు. దీని ద్వారా రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చగలిగామని పేర్కొన్నారు.

తుంగభద్ర డ్యాం గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు సూచించినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. రాయలసీమ కరువు ప్రాంతానికి తుంగభద్ర జలాల ప్రాధాన్యతను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కొత్త గేట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

ప్రముఖ నిపుణుడు కన్నయ్యనాయుడు సూచనల మేరకు 70 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో ఆధునిక కొత్త గేట్లను ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. ఒకే సీజన్‌లో పాత గేట్లను తొలగించి రూ. 51 కోట్ల వ్యయంతో 33 కొత్త గేట్లను ఏర్పాటు చేయడం దేశంలోనే అరుదైన రికార్డుగా నిలిచిందన్నారు. తుంగభద్ర జలాల ద్వారా రైతులకు, ప్రజలకు మరింత ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## దేవుడి సొమ్ము దేవుడికే..
# సనాతన ధర్మ రక్షణే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

ఆలయాల భద్రత, ఆస్తుల రక్షణ కోసం డీజీపీ, కలెక్టర్లతో కూడిన హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

దేవాదాయ శాఖ పరిధిలోని భూముల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మంత్రి అన్నారు. గతంలో 22-ఏ కింద నమోదైన భూములపై విచారణ జరిపి అర్హులైన రైతులకు ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఆలయాలకు సంబంధించిన 162 పునర్నిర్మాణ పనులను రూ. 71.60 కోట్లతో చేపట్టామని, 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. పుష్కరాల కోసం 12 మంది మంత్రులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేశామని, ఘాట్ల నిర్మాణం, భక్తుల సౌకర్యాలపై ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. తిరుమలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలతో భక్తుల నిర్వహణ మెరుగుపరిచామని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల ఆదాయం, భక్తుల సంఖ్య పెరిగిందని మంత్రి తెలిపారు. ఆలయాలను కేవలం పూజా స్థలాలుగా కాకుండా సామాజిక, సాంస్కృతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలకు
# బ్రాండ్ అంబాసిడర్ జగన్

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అ-ర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి లేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో రైతులను నష్టపరిచి ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

జగన్ తాజా ట్వీట్ అబద్ధాలకు వేదికగా మారిందని మంత్రి అన్నారు. రైతు సంక్షేమంపై జగన్ చేస్తున్న విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2025--26 సంవత్సరానికి రూ. 300 కోట్లు బడ్జెట్ కేటాయించినప్పటికీ రైతుల అవసరాల మేరకు రూ. 588 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.

ఆక్వా రైతులు, పొగాకు రైతుల విషయంలోనూ జగన్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆక్వా ఫీడ్ ధరల విషయంలో వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే రోజులు పోయాయని, రైతుల సంక్షేమం కోసం పనిచేసేది ఎవరో ప్రజలకు తెలుసని మంత్రి పేర్కొన్నారు.

## నాలుగు రాష్ట్రాల్లో.. ఓటు హక్కు!
# ప్రకాశ్ రాజ్‌పై.. నాన్ బెయిలబుల్ వారెంట్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సినీనటుడు ప్రకాశ్ రాజ్ పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. నాలుగు రాష్ట్రాల్లో ఓటరు గుర్తింపు కార్డులను కలిగి ఉన్నారంటూ దాఖలైన కేసులో బెంగళూరు 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ఈ వారెంట్ జారీ చేసింది. ప్రకాశరాజ్‌కు పలుచోట్ల ఓటు హక్కు ఉందంటూ దిలీప్ కుమార్ అనే న్యాయవాది 2019లో బెంగళూరు నగరం హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆ తర్వాత బీబీఎంపీ అధికారులు, కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతో పాటు ఏపీలోనూ ప్రకాశ్ రాజ్‌కు ఓటు హక్కు ఉందన్నారు. ఈ కేసులో ప్రకాశ్ రాజ్ విచారణకు వరు సగా హాజరు కాకపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

# రవాణా శాఖలో సంస్కరణలు.. పారదర్శక సేవలకు పెద్దపీట

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత రెండేళ్లలో రాష్ట్ర ప్రజా రవాణా వ్యవస్థలో సాంకేతికత, పారదర్శకత, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక సంస్కరణలు అమలు చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన, సురక్షితమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ , ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధిగా, అభివృద్ధి -- సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రవాణా రంగాన్ని ఆధునీకరించేందుకు అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.

ప్రజల సమయాన్ని ఆదా చేయడం, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడం లక్ష్యంగా రవాణా శాఖలో పూర్తిస్థాయి డిజిటల్ మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, పన్నుల చెల్లింపులు వంటి సేవలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తగ్గించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ద్వారా పారదర్శకమైన డ్రైవింగ్ పరీక్షల విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా అభ్యర్థుల డ్రైవింగ్ నైపుణ్యాలను అంచనా వేసి లైసెన్సులు జారీ చేస్తున్నామని, దీనివల్ల రహదారి భద్రత కూడా మెరుగుపడుతోందని పేర్కొన్నారు.

రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు "సారథి" మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. లైసెన్స్, వాహన నమోదు, పర్మిట్, ఫీజు చెల్లింపులు, దరఖాస్తుల స్థితి వంటి సేవలను ఒకే వేదికపై పొందే అవకాశం కల్పించామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి వెల్లడించారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాల ద్వారా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రయాణికులతో వ్యవహరించే విధానం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

రవాణా శాఖ ఆదాయంలో గణనీయమైన వృద్ధి సాధించామని మంత్రి తెలిపారు. డిజిటల్ సేవలు, పారదర్శక విధానాలు, సమర్థవంతమైన పన్నుల వసూళ్ల ద్వారా శాఖ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంలో ఈ సంస్కరణలు కీలకంగా మారాయని తెలిపారు.

మహిళలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. "స్త్రీశక్తి" పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, "దివ్యాంగ శక్తి" కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సులభమైన, గౌరవప్రదమైన ప్రయాణ సౌకర్యాలు అందిస్తున్నామని వివరించారు.

రోడ్డు భద్రతను మెరుగుపరచేందుకు అత్యాధునిక 24ఐ7 కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. బస్సుల కదలికలు, వేగం, ప్రయాణ మార్గాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ఏపీఎస్‌ఆర్టీసీలో కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపారు.

# తలసేమియా చిన్నారులతో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న నారా భువనేశ్వరి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన పుట్టినరోజును సోమవారం ఎన్‌టీఆర్ ట్రస్ట్‌లోని తలసేమియా కేర్ సెంటర్ చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, వారికి చాక్లెట్లు, గిఫ్ట్ హాంపర్స్ అందించారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు నారా భువనేశ్వరి ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా నిరంతరం అండగా నిలుస్తున్నారు. తలసేమియా బాధితులకు అవసరమైన రక్తమార్పిడి, మందుల సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల్లో భారీ స్థాయిలో 'తలసేమియా రన్' కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విజయవాడలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్' నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా సాధారణ ప్రజల నుంచి ప్రముఖుల వరకు తలసేమియాపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

తలసేమియా బాధితులు నెలకు రెండుసార్లు రక్తమార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని, ఉచిత రక్తనిధి ద్వారా వందలాది మంది చిన్నారులకు, వారి కుటుంబాలకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. తలసేమియా బాధిత పిల్లలకు నారా భువనేశ్వరి ఒక ఆశాదీపంగా నిలుస్తున్నారని ట్రస్ట్ వర్గాలు పేర్కొన్నాయి.

ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియా కేర్ సెంటర్‌లోని చిన్నారుల మధ్య పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. తలసేమియా బాధితుల కోసం ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఉచిత రక్తమార్పిడి, అవసరమైన మందుల అందజేతకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఉన్న తలసేమియా బాధితులకైనా ఎన్‌టీఆర్ ట్రస్ట్ తరపున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. త్వరలోనే విజయవాడలో తలసేమియా కేర్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్ (రిటైర్డ్ ఐపీఎస్), సీవోవో అడుసుపల్లి గోపి, హెరిటేజ్ హోల్‌టైమ్ డైరెక్టర్ డా. ఎం. సాంబశివరావు, ఎన్‌టీఆర్ ట్రస్ట్, హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత



- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ సోమవారం స్థానిక స్వర్ణ ప్యాలెస్ లో మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 45వ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన వెబ్‌సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎం వి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్,వెల్ఫేర్ బోర్డు సభ్యులుఎ. వెంకట రమణి, శ్రీమతి ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు,డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వారం నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలు, కన్వర్జెన్స్ సమావేశాలపై ప్రత్యేక అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా గుర్తించిన అంశాలపై అధికారులు తమ పరిశీలనలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, నాణ్యత, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, సిబ్బంది, మందుల లభ్యత వంటి అంశాలపై చర్చించారు.

గుర్తించిన సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు.

ప్రతి నియోజకవర్గంలో సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలు లేదా భవనాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. గుర్తించిన వివరాలను త్వరగా జిల్లా పరిపాలనకు అందించాలని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న జలధార పనులను ఈ నెలలోనే పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గ్రీన్ గుంటూరు కార్యక్రమం కింద జిల్లాకు కేటాయించిన 1.20 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని సాధించేలా మండలాలు, నియోజకవర్గాల వారీగా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. మొక్కల నాటే పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

కాలువల్లో నీటి కలుపు మొక్కలు, వాటర్ హయసింత్ తొలగింపు పనులు నిరంతరం జరిగేలా నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

అన్ని అభివృద్ధి కార్యక్రమాల అమలును నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించి కాలానుగుణంగా పురోగతి నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చురుకైన పర్యవేక్షణ, సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

సమావేశం ముగింపులో అప్పగించిన బాధ్యతలను వేగంగా పూర్తి చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై సమర్థవంతమైన పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ అధికారులకు సూచించారు.

## స్వర్ణాంధ్ర లక్ష్యాలపై
# ప్రణాళికా విభాగం ఎంఓయూ



(మొదటి పేజీ తరువాయి)

స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతో పాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చి సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వంతో పనిచేయనుంది. ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం, విధాన పరమైన సూచనలు అందిస్తుంది. ఈ 10 సూత్రాలకు సంబంధించి కొత్త పద్దతులకు సిఫారసు చేస్తుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపై పనిచేయాలని నిర్ణయించారు. పది సూత్రాల అమలుపై రాష్ట్రస్థాయి కమిటీతో పాటు మిషన్ వర్కింగ్ గ్రూప్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్‌ను ఇంటిగ్రేషన్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్ ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, రేర్ ఎర్త్ మినరల్స్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ లాంటి రంగాల్లో ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని అన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీని కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎమ్ఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.

# లఖ్‌నవూలోని కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం



**లఖ్‌నవూ(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిది ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

**లఖ్‌నవూ అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం.

లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు.

# కొత్తూరు గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం..



**పెద్దపల్లి, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఆదివారం రోజున జూన్21 అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గ్రామ తండాలో ప్రాముఖ్యత కలిగిన యోగ గురువు ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద , చిన్న అందరూ కలిసి యోగ చేయడం జరిగింది. మరియు ప్రతి రోజు ఉదయం వేళ యోగా చేయడం వలన ఏకాగ్రత, ఆరోగ్యం బాగుంటుందని యోగా గురువు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్ - భయంలో మాదారం వాసులు



**తాండూర్, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

తాండూర్ మండలం మాదారం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర స్థితికి చేరి గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన గద్దె పూర్తిగా పగిలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఒకవైపు ఒరిగి నిలిచింది. సమీపంలో నివాసాలు ఉండటంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన గద్దె కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని వారు చెబుతున్నారు. వర్షాలు, బలమైన గాలులకు ట్రాన్స్‌ఫార్మర్ కూలితే విద్యుత్ ప్రమాదాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న గద్దెను తొలగించి కొత్త గద్దె నిర్మించాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగాక చర్యలు కాకుండా ముందుగానే స్పందించి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కోరుకుతున్నారు.

# నాంపల్లి కోర్టులో యోగా దినోత్సవం



**మంచిర్యాల, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

హైదరాబాద్ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జుడీషియల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగ మాస్టర్, న్యాయవాది కొట్టే నటేశ్వర్, డాక్టర్ పూనమ్ యోగ, ప్రాణాయామం, ధ్యానం విశిష్టతను వివరించి పలు ఆసనాలను చేపించారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు, జుడీషియల్ అధికారులు, సిబ్బంది యోగా మాస్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగ మాస్టర్ నటేశ్వర్ మాట్లాడుతూ యోగ అనేది చిన్నా, పెద్దా, మహిళలు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ చేసి ఆరోగ్యంగా ఉండవచ్చని, అనారోగ్యాన్ని జయించవచ్చని తెలిపారు. "రోగం భోగం వద్దు, యోగం ముద్దని" ఆయన పేర్కొన్నారు.

# ఆపన్నులకు అండగా సీఎం సహాయనిధి



**శేరిలింగంపల్లి, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలికి చెందిన హర్షవర్ధిని అత్యవసర వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్వోసీ మంజూరైంది. ఆదివారం వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ఆయన ఈ మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేదల పక్షపాతి అయిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, లింగం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన జుగల్బందీ



**శేరిలింగంపల్లి, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంగీత విభావరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఎస్ఎం మ్యూజిక్ అకాడమీ, సితార్ విద్వాంసుడు నవీన్ కుమార్ శిష్య బృందం ప్రదర్శించిన తబలా-ఫ్లూట్ జుగల్బందీ, సితార్-తబలా విన్యాసాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్ణాటక గాత్రంతో పాటు ఫ్లూట్, తబలా, సితార్ వాయిద్యాలపై కళాకారులు పలికించిన స్వరాలు ప్రేక్షకులను విశేషంగా రంజింపజేశాయి. ఈ వేడుకలో కళాకారులు సురేష్, సిద్దేశ్వర్, కేశవ్ దాస్, సౌందర్య, సృజన, సుకన్య, కిరణ్, భవాని, మృదుల, వాణి, సోహంగ్, రుద్రాన్ష్ తదితరులు తమ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

# గిద్దలూరులో ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**గిద్దలూరు, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

గిద్దలూరు పట్టణంలోని బిలాల్ మసీదు ఆవరణలో ఆదివారం ఉదయం ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం నియోజకవర్గ కమిటీ సభ్యులు, వివిధ మసీదుల అధ్యక్షుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా గుడిసె మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులుగా పఠాన్ జఫ్రుల్లా ఖాన్, ఎన్నారై రఫీ, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ చాంద్ బాషా, కార్యదర్శులుగా షేక్ మహబూబ్ సాహెబ్, సయ్యద్ ఖాసిం, సహాయ కార్యదర్శిగా పఠాన్ సయ్యద్ పీర్ ఖాన్, కోశాధికారిగా పఠాన్ మహబూబ్ ఖాన్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా సభ్యులుగా చిన్నవలి, పి. ఖాసింఖాన్, షేక్ మహమ్మద్ రఫీ, షేక్ దస్తగిరి, షేక్ సయ్యద్, సద్దాం హుస్సేన్, డి. దస్తగిరి, షేక్ అలీ, షేక్ ఖాసిం వలి, షేక్ ఇస్మాయిల్, షేక్ అల్లాబక్ష్, షేక్ ఖాదర్ బాషా, సిద్దిక్, షేక్ ఇబ్రహీం, షేక్ ఖాజామొద్దీన్, షేక్ గఫూర్‌లను ఎన్నుకోగా, గౌరవ అధ్యక్షులుగా పఠాన్ హుసేన్ ఖాన్, సలహాదారులుగా షేక్ అబ్దుల్ ఖాదర్, షేక్ మస్తాన్ వలిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గుడిసె మహబూబ్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆదాయం లేని మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్లు,



మౌజనులకు గౌరవ వేతనాల కోసం గత ఎనిమిది సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఆదాయం లేని మసీదుల తరఫున దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఇమామ్లు, మౌజనులకు గౌరవ వేతనాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని వివిధ మసీదుల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# 28 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు




**రాయికల్, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయికల్ మండలం భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో 19981999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 28 సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యార్థి దశలో జరిగిన సరదా సంఘటనలను ఒకరితో ఒకరు పంచుకుంటూ పాత అనుబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు.

అనంతరం సమాజ సేవలో భాగంగా విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలవాలని పూర్వ విద్యార్థులు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో 19981999 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఏనుగు ముత్యంరెడ్డి, వాసాల సురేష్,శ్రీధర్, రమేష్, వాసాల శ్రీనివాస్,మర్యాద సత్యనారాయణ,మారంపెల్లి లక్ష్మీనారాయణ,కవిత,అనురాధ,శ్రీలత, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలో నీట్ పునః పరీక్షలు ప్రశాంతంగా ముగింపు

- 1,521 అభ్యర్థులు కేటాయింపు - 1,401 మంది హాజరు
- అవాంఛనీయ సంఘటనలు లేకుండా నీట్ పునః పరీక్షల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)-2026 పునః పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం, జిల్లాలో మొత్తం 1,521 మంది అభ్యర్థులకు పరీక్ష కేటాయించగా, వారిలో 1,401 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కేటాయించిన పురుష అభ్యర్థులు - 432 మంది,కేటాయించిన మహిళా అభ్యర్థులు - 1,089 మంది,హాజరైన పురుష అభ్యర్థులు - 407 మంది,హాజరైన మహిళా అభ్యర్థులు - 994 మంది,మొత్తం హాజరైన అభ్యర్థులు



- 1,401 మంది,గైర్హాజరైన అభ్యర్థులు - 120 మంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, దివ్యాంగ (పి.డబ్ల్యు.డి.) అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కేటాయించి సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ, ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం ఆన్సర్ షీట్లను నిర్దేశిత భద్రతా నిబంధనల ప్రకారం పోస్టల్ వ్యవస్థ ద్వారా సంబంధిత అధికారులకు పంపించే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు తాగునీరు, బిస్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆర్డీవో విశ్వనాథ్, తాసిల్దారు శ్రీనివాసులు, తాలూకా సిఐ ఈశ్వరయ్య ,ఎస్సై గంగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు

# ప్రతి విద్యార్థి ప్రతిరోజు యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలి

## చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి




**నంద్యాల, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (అటనామస్), క్రీడాభారతి భారతి నంద్యాల మరియు మేర యువ భారత్ నంద్యాల,సంయుక్తఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (అటానమస్), నంద్యాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సీసీ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ యోగా ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంపొందిస్తుందని, విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.బి.వి. సుబ్బయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు భావోద్వేగ సమతుల్యతను పెంపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా ఉపాధ్యాయురాలు శ్రీమతి లలిత సరస్వతి గారు విద్యార్థులు, అధ్యాపకులకు వివిధ యోగా ఆసనాలు మరియు ప్రాణాయామాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా యొక్క ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ఆఫ్ అకాడెమిక్స్ శ్రీమతి ప్రగతి గారు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సీసీ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అందరి సహకారంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. చివరిగా యోగా శాంతి మంత్రాన్ని పఠించి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేస్తూ పాల్గొన్న వారందరూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాలు

## - మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు



**నంద్యాల, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఈ నెల 22 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు నంద్యాల మండలం లోని అన్ని గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించబడునని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో రైతు సేవా సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయంలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరుగుతుంది. ఈ ఖరీఫ్ సీజన్ లో పంటలపై ఎల్నినో ప్రభావం ఉంటుందని, వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పంటలను వేసుకోవాలని, వరి పంట సాగు తగ్గించి పప్పు ధాన్యాలు సాగు చేసే విధంగా రైతు సేవా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సూక్ష్మ నీటి పద్ధతులు అవలంబించే విధంగా రైతులను ప్రోత్సహించడం జరుగుతుంది. అదే విధంగా యూరియా మరియు డి. ఎ.పి ఎరువులను ఘ్రాూా×మీ ఆప్ ద్వారా పంపిణీ చేసే విధానాన్ని రైతులకు వివరించబడునని , ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ 30 క్లస్టర్స్ లోని 90 రైతు కుటుంబాలను కలిసి పై విషయాలపై రైతు సేవా సిబ్బంది అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# రెజొనెన్స్ శ్రీనగర్ లో అంతర్జాతీయ యోగా డే

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలో గల శ్రీనగర్ కాలనీ రెజొనెన్స్ స్కూల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా ఆసనాలు విద్యార్థుల కోలాహలంతో యోగా డేను ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది.పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు పాల్గొని మాట్లాడుతూ 21 నుండి ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా డే ను నిర్వహించు కుంటున్నామంటూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ ఏవిధంగా మెరుగు పరుచుకోవచ్చో విపులంగా చెబుతూ యోగా అనేది 5000 సంవత్సరాల నుండి భారత దేశంలో ఉన్న జ్ఞానము యొక్క అంతర్భాగం అంటూ యోగా మతంనకు సంబంధించినది కాదు ఇది ఒక జీవన విధానం మనిషి యొక్క అంతర్గత శక్తులను నియంత్రించుకుంటూ ఆనందం, ఆరోగ్యంతో జీవించడం. నిజానికి మానవుని యొక్క అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తి కలయిక. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటే పరిపూర్ణ జీవనసార విధానం అని విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా వలన ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిస్పృహలను దూరం చేసి మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తుందంటూ రెజొనెన్స్ శ్రీనగర్ యోగా టీచర్తో యోగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ అంతర్జాతీయ యోగా డే శుభాకాంక్షలు తెలియజేసారు.పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా, మంచి ఆహారపు అలవాట్లను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తూ ఉన్నత స్థాయిని అదిరోహించవచ్చని మరియు యోగాసనాలు శరీరానికి ఆరోగ్యాన్ని మంచి ఆకారాన్ని ధృఢత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైనా, చిన్నవారైనా ఆసనాలు వేయటానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనుక ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుందని, అనతి కాలంలోనే యోగాని ప్రపంచమంతా గుర్తించి సంవత్సరంలో ఒక రోజును కేటాయించటం చాలా సంతోషం. ప్రతిరోజూ యోగా చేయటం వలన పిల్లలు, పెద్దలు అందరూ ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తారని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.వి.ఆర్. మురళీమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.



# బోడేపూడి వైద్య శిబిరం విజయవంతం

## - ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి అన్నారు. స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వేంకటేశ్వర రావు భవనంలో ప్రతి నెల మూడవ ఆదివారం నిర్వహించే బోడేపూడి వైద్య శిబిరాన్ని 131వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపూడి వైద్య శిబిరం ద్వారా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. బోడేపూడి వైద్య శిబిరంలో ప్రతి నెల వందల మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. ఆదివారం వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ షుగర్ పేషెంట్లు ప్రధానంగా తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఫైబర్ ఉన్న ఆహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలని, ప్రతి రోజు తప్పకుండా 30 నిమిషాలు వాకింగ్ చేయాలని, ఒత్తిడి లేని జీవితం గడపాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బిపి, సుగర్ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు సీజనల్ వ్యాధులు రాకుండా జాగర్తగా ఉండాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు కాచి చల్లార్చి మంచినీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్య శిబిరం వాలంటీర్లు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్ రావు, బొంతు సమత, మాదినేని రజిని, కంభంపాటి సత్యనారాయణ, మల్లెంపాటి ప్రసాదరావు, హరి వేంకటేశ్వరరావు, పూనాటి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



# బల్లేపల్లి, పాండురంగాపురం గ్రామాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలంలో చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి, అంటువ్యాధుల వ్యాప్తిని నివారించడానికి, మిసెస్ ఇండియా విజేత, ఫిట్ ఇండియా అంబాసిడర్, స్వచ్ఛ సర్వేక్షణ్ అంబాసిడర్, సామాజిక కార్యకర్త, మార్పుకర్త అయిన డాక్టర్ ఎం.ఏ. ఫర్హా నాయకత్వంలో బల్లేపల్లి, పాండురంగాపురం గ్రామాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం బల్లేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమైంది. ఇక్కడ విద్యార్థులకు సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వైరల్ జ్వరాలు, కడుపు ఇన్ఫెక్షన్లు, ఇతర అంటువ్యాధుల వంటి కాలానుగుణ అనారోగ్యాలను నివారించడంలో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం ఎలా సహాయపడుతుందో డాక్టర్ ఫర్హా వివరించారు. హ్యాండ్‌వాష్ ఉత్పత్తులను పంపిణీ చేశారు. పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ అవగాహన కార్యక్రమాన్ని తరువాత పాండురంగాపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి విస్తరించారు. అక్కడ వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, వ్యాధులు ప్రబలకుండా నివారించడంపై సమాజ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశుభ్రత ప్రచారానికి మద్దతుగా ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తలకు హ్యాండ్‌వాష్ ఉత్పత్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫర్హా మాట్లాడుతూ వ్యక్తులను, సమాజాలను అంటువ్యాధుల నుండి రక్షించడానికి చేతుల పరిశుభ్రత అనేది అత్యంత సరళమైన, ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి అని నొక్కి చెప్పారు. కుటుంబాలు సరైన పరిశుభ్రత పద్ధతులను పాటించాలని, పిల్లలు మరియు విస్తృత సమాజంలో అవగాహన కల్పించాలని ఆమె ప్రోత్సహించారు.ప్రజా ఆరోగ్యం, పారిశుధ్యం, సామాజిక సంక్షేమం పట్ల ఆమె చేసిన అంకితమైన సేవకు గుర్తింపుగా, పాండురంగాపురం అంగన్‌వాడీ కేంద్రం అధిపతి ఎ.ఎం. సత్యవాణి, ఆమె సహోద్యోగులతో కలిసి డాక్టర్ ఎం.ఎ. ఫర్హాను సత్కరించారు. ఆరోగ్యం, పరిశుభ్రత సమస్యలపై అవగాహన కల్పించడంలో ఆమె చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు.ఈ ప్రచారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక నివాసితులు చురుకుగా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, "శుభ్రమైన చేతులు ప్రాణాలను కాపాడతాయి" అనే బలమైన సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు

## - కోడూరి రమేష్



**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్):** ఇబ్రహీంపట్నంమండల,తూలేకలాన్(పేతుల్ల) గ్రామానికి చెందిన అచ్చన బాషా 60000 రూపాయలు మరియు కోడూరి అఖిల 35000 రూపాయలు,బత్తుల చెంద్ర శేఖర్ 28000 రూపాయలు,కోడూరి శంకర్ 9000 రూపాయలు,సమాదానమ్మకు 60000 రూపాయలు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా కోడూరి రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సీఎం సహాయ నిధులు ఎల్ ఓ సిలు ఇస్తూ పేదలకు అండగా వుంటున్నారు అని అదే విదంగా గ్రామాలను పట్టణలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అని ఈ సందర్బంగా తెలిపారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పర్టీ సీనియర్ నాయకులు శశాంక్ రెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ మక్కా పెల్లి అంజయ్య గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు బండి సంతోష వెంకటేష్ కలకొండ కృష్ణ బండ శ్రీశైలం బోడ మహేందర్ ఎడ్ల కిషన్ రెడ్డి బోడ నర్సింహా సమా తిరుమల్ రెడ్డి పూజారి యాదగిరి జక్కుల మల్లేష్ దయ్యాలా కుమార్ దాచపెల్లి సాయి కుమార్ రాము పెండ్యాల గణేష్ కలకొండ శివ కలకొండ అంజయ్య గారు పాల్గొన్నారు.

# రాజకీయ స్వార్థం కోసం విద్యా వ్యవస్థను నాశనం చేయవద్దు



**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్):** మంచాల మండలంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌పై బీఆర్ఎస్ ఆరోపణలను శనివారం ఖండించిన అభివృద్ధి కమిటీకేసీఆర్ హయాంలో కట్టిన భవనాలకే తుదిమెరుగులు దిద్దారన్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదు: కమిటీ సభ్యుల స్పష్టీకరణ.పాఠశాల అభివృద్ధికి అందిన రూ. 10.91 కోట్ల నిధుల వివరాలను బహిరంగపరిచిన విద్యా కమిటీ.ఎస్‌డిఎఫ్ సంస్థ నుండి రూ. 3 కోట్లు, ప్రభుత్వం ద్వారా రూ. 5.31 కోట్లు అందినట్లు వెల్లడి.పిఎం శ్రీ పథకం ద్వారా రూ. 34 లక్షలు, వివిధ శాఖల ద్వారా రూ. 18 లక్షల నిధులు మంజూరుఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నందున మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.12 కోట్లు దాటే అవకాశం ఉందన్న కమిటీ.గతంలో అడ్మిషన్లపై ఆసక్తి చూపని గ్రామస్థులు.. ఇప్పుడు సీఎం ప్రారంభించాక పెరిగిన భారీ తాకిడి.నిధుల లెక్కలపై అవగాహన లేకుండా ఉపాధ్యాయుల, అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అసత్య ప్రచారాలునిరుపేద పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవద్దని,చేతనైతే స్కూల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# గీత కార్మికుడు సుంకరి లచ్చయ్య గౌడ్ సతీమణి సుంకరి సత్యమ్మ దశదినకర్మ



**ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో జరిగిన గీత కార్మికుడు సుంకరి లచ్చయ్యగౌడ్ సతీమణి సుంకరి సత్యమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని సత్యమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన గౌడ సంఘం పెద్దలు సభ్యులు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు ఈ కార్య క్రమంలో గౌడ సంగం పెద్దలు చెరుకు నరసింహగౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ముద్దం శంకరయ్యగౌడ్ పెద్దగోని శ్రీనివాస్ గౌడ్ మద్దెల కృష్ణగౌడ్ దూసరి రమేష్ గౌడ్ పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్ దూసరి రాజు గౌడ్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

## - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్







**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం – 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు.యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాల పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి , జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సన్న రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలే

**ఖమ్మం, జూన్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వ సరఫరా చేస్తున్న సన్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్ కుతరలిస్తున్న రేషన్ డీలర్లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కల్లూరు ఎస్సై హరిత తెలిపారు.ఏప్రియల్ 24, 25 తేదీలలో సివిల్ సప్లై డిపార్ట్మెంట్ లోని సత్తుపల్లి సివిల్ సప్లై చెకింగ్ ఇన్స్పెక్టర్, ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ఫోర్స్ టీం ఓఎస్ డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం పేరవంచలో గల ఎఫ్ పి షాప్ నెంబర్ 2232015, కల్లూరు మండలం ఖాన్ ఖాన్ పేట ఎఫ్ పి షాప్ నెంబర్ 2232005 లలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయగా ఎఫ్ పి షాప్ నెంబర్ 2232015 లో స్టాక్ రిజిస్టర్ లో ఉండవలసిన దాని కన్నా 12.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం 71,775 రూపాయల విలువైనవి అదేవిదంగా ఎఫ్ పి షాప్ నెంబర్ 2232005 లో 64.01 క్వింటాళ్ల 3,67,545 రూపాయల విలువైన రేషన్ బియ్యం అదనంగా ఉండడంతో రేషన్ డీలర్లను విచారించగా ఇరువురు అవకతవకలకు పాల్పడి, ప్రభుత్వం సరఫరా చేయుచున్న సన్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్కు రీసైకిల్ చేస్తున్నట్లుగా గుర్తించి రేషన్ షాప్ డీలర్ అయిన రాయల నాగేశ్వరరావు, నివాసం పేరువంచ అను అతనిపై చీటింగ్, నమ్మకద్రోహం సెక్షన్ల కింద సివిల్ సప్లై అధికారి వేముల నరేష్ ఫిర్యాదు మేరకు సదరు ఇరువురు రేషన్ డీలర్ల పై కేసులు నమోదు చేశారు . ఆయా కేసులలో ఒక రేషన్ డీలర్ అయిన రాయల నాగేశ్వరరావు, మెరుగు వేలాద్రి, నివాసం ఖాన్ ఖాన్ పేట చెందిన వ్యక్తులను అరెస్ట్ చేసి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్తుపల్లి ముందు హాజరు పరచగా ఇరువురికి జులై 3 వరకు జుడీషియల్ రిమాండ్ విధించారని తెలిపారు. కల్లూరు మండలంలో ఎవరైనా రేషన్ డీలర్లు లేదా బియ్యం వ్యాపారస్తులు పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని అక్రమంగా నిలువ చేస్తూ వ్యాపార నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. అలాగే అట్టి వ్యాపారం నిర్వహించే వారి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన పారితోషికం ఇస్తామని పేర్కొన్నారు.

# అర్హులైన కూలీలందరికీ కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలి

## - సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్



**నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ శాఖ సమావేశం చుట్టూ వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిద్దినేని కర్ణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి భద్రత కల్పించాల్సిన ఉపాధి హామీ పథకాన్ని అధికారులు, ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త జాబ్ కార్డుల కోసం పేదలు నాలుగేళ్లుగా దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఒకవైపు అర్హులకు కొత్త కార్డులు ఇవ్వడం లేదు సరే, మరోవైపు ఇప్పటికే పాత కార్డులు ఉన్నవారికి కూడా నాలుగేళ్లుగా సరిగ్గా పనులు చూపించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 14 వారాలుగా కూలీలు చేసిన పనికి రావాల్సిన ఉపాధి బకాయి డబ్బులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అలాగే, ఏళ్లుగా ఆశగా ఎదురు చూస్తున్న అర్హులైన వితంతు మహిళలకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదల సమయాన్ని వృథా చేస్తూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల మొండి వైఖరి నశించాలన్నా, మన హక్కులు సాధించుకోవాలన్నా పోరాటమే శరణ్యమని స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జరిగే మహా ముట్టడి కార్యక్రమానికి భైరవునిపల్లి గ్రామం నుండే కాకుండా మండలంలోని ప్రతి గ్రామం నుండి ఉపాధి కూలీలు, వితంతువులు, వ్యవసాయ కార్మికులు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, గ్రామ సహాయ కార్యదర్శి బాలేబోయిన వేంకటేశ్వర్లు, శాఖ సభ్యులు కుంచం బిక్షం, ముత్యాల వేంకటేశ్వరరావు, బాలిన పెద్ద నారాయణ, బాలిన చిన్న నారాయణ మరియు ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం




**రాజేంద్రనగర్, (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ రాజేంద్ర నగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ స్కూల్ ప్రేమవతి పేట గ్రామంలో యోగా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..యోగా అనేది భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన గొప్ప వరం.యోగ వల్ల వచ్చే లాభాలు ఆరోగ్యం,చదువు, క్రమశిక్షణ మనకి మంచి అలవాట్లు వస్తాయి.ప్రతి ఒకరు యోగాన్ని ప్రతిరోజు చేయాలని పిలుపు ఇవ్వడం జరిగింది.యోగా గురువులు మూల్ చంద్ శర్మ జి,అజిత్ సింగ్,హరి కిషన్ కి,సోల్కర్ రెడ్డి,డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,పద్మావతి,భవాని దాస్,నారతం రెడ్డి,మురళీమోహన్, ఆగపల్లి నరసింహ,దయానంద్,జంగయ్య,యాదగిరి యాదవ్, ఈశ్వర్, రాజు రెడ్డి, భాష, నాయకులు పాల్గొన్నారు

# ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్గా మారుతి వీరభద్ర ప్రసాద్ నియామకం



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు మారుతి వీరభద్ర ప్రసాద్ ను బీజేపీ ధార్మిక సెల్ ఖమ్మం జిల్లా కన్వీనర్గా నియమించారు. 1987లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, అనంతరం బీజేపీ ఖమ్మం నగర అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు జిల్లా ఉపాధ్యక్షుడిగా, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్గా, జిల్లా అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు.తనపై విశ్వాసం ఉంచి ధార్మిక సెల్ ఖమ్మం జిల్లా కన్వీనర్గా నియమించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు నారప రాజు రామచంద్రరావు, రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ అన్నావుజుల సూర ప్రకాష్ రావు, పొంగులేటి సుధాకర్ రెడ్డిలకు మారుతి వీరభద్ర ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతంతో పాటు దేవాలయాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర పోషిస్తానని ఆయన పేర్కొన్నారు.

# యోగతో ఆరోగ్యం, యోగతో ఆనందం

## - అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జమాల్ ఖాన్



**చింతూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** యోగాతో ఆనందం ఆరోగ్యం లభిస్తుందని చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్ పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీషాదేవి సూచనల మేరకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చింతూరు లోని ట్రైబల్ గర్ల్స్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు ఎంపీడీవో శ్రీనివాస్ దొర ,విద్యార్థులు, జమాల్ ఖాన్ యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనగా, లక్షలాది మంది యోగా సాధన చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది విజయవాడలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేశారని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా అత్యంత అవసరమైందని, శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు ఆనందాన్ని ప్రసాదించే యోగాను ప్రతి కుటుంబం తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని జమాల్ ఖాన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు,పసుపులేటి సల్మాన్ రాజు,టీడీపీ సీనియర్ నాయకులు పొదిలి రామారావు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఈ నెల 23 నాటికి పూర్తి చేయాలి



- స్వర్ణ గ్రామ ,వార్డు సచివాలయాల సేవలు జవాబుదారీతనం పెరగాలి
- జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**:జిల్లాలో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడానికి మరియు రెవెన్యూ, భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు.
సోమవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ తో కలసి డివిజన్ , మండల , మున్సిపల్ స్థాయి అధికారులు , నియోజకవర్గ , మండల ప్రత్యేక అధికారులు , యంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్లతో పీజీఆర్ఎస్ , ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ , జలధార , రెవెన్యు అంశాలు , భూముల సేకరణ , ఎం జీ ఎన్ ఆర్ ఈ జీ ఎస్ , స్వర్ణ గ్రామ , స్వర్ణ వార్డు సచివాలయాలు , ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు , తల్లికి వందనం , గ్రీన్ గుంటూరు , ఈ కే వైసీ , వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారుని అర్జీ పరిష్కారానికి ఒక నిర్దిష్ట గడువు ఉంటుందని , ఆ సమయంలోగా సంబంధిత అధికారులు సమస్యను నాణ్యతగా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×= ) -2026 కార్యక్రమం కింద ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ మరియు డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలన్నారు. బీఎల్ఓ లు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ఈ నెల 23 నాటికి పూర్తి చేయాలన్నారు. అర్హులైన ఓటర్లు తమ వివరాలను ధ్రువీకరించి సంబంధిత బీఎల్ఓ కు ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి అందించాలన్నారు.
జలధార ద్వారా జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, కుంటలలో ఉపాధి హామీ పథకం కింద ముమ్మరంగా పూడికతీత పనులు ఈ నెలాఖరు నాటికి చేపట్టాలన్నారు. వర్షపు నీరు వృధా కాకుండా చెరువులకు చేరేలా పిచ్చిమొక్కల తొలగింపు , కాలువల పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఈ నెల 26 నాటికి పూర్తి చేయాలన్నారు. జలధార కింద పూర్తి అయిన పనులకు సంబంధించి బెఫోరే , ఆఫ్టర్ వర్క్ కు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు మరియు కాలువల నిర్మాణం , జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం కోసం చేపడుతున్న భూ సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతున్నదని , ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలన్నారు. వీబీ-జీ రామ్ జీ పథకం క్రింద చెరువుల పూడికతీత మరియు పునరుద్ధరణ , కాలువల నిర్మాణం మరియు నీటి నిల్వ పనులు చేపట్టాలన్నారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయాలు పై సమీక్షిస్తూ సచివాలయ సిబ్బంది అంతా విధిగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలని , సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. సేవల్లో జాప్యం తగ్గించి, జవాబుదారీతనం పెంచేందుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు, సమస్యల పరిష్కారం తదితర సేవల్లో ఎటువంటి అంతరాయం లేకుండా మరింత పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.
ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో హెచ్ ఓ డి స్థాయిలో మొదటి ఐదు ర్యాంక్ లో ఉండేలా చూడాలన్నారు. గ్రీన్ గుంటూరు ప్రాజెక్ట్ కింద జిల్లా వ్యాప్తంగా జూలై నెలఖారు నాటికి లక్ష 20 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. మొదటి కేటగిరి కింద చెరువులు, పొలం గట్లపైన , పంచాయితీ స్థలాల్లో పండ్ల మొక్కలు , రెండవ కేటగిరి కింద అర్బన్ ప్రాంతాలలో రోడ్ల ప్రక్కన నీడనిచ్చే మొక్కలు నాటాలన్నారు. ప్రతి మండలానికి నిర్ణీత లక్ష్యాలు నిర్ణయించడం జరిగిందన్నారు. ఆధార్ లేని పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. నియోజకవర్గ , మండల ప్రత్యేక అధికారులు అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేయలన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటేషన్ మెరుగుపరచేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎం ఎస్ ఓ లు , నియోజకవర్గ ప్రత్యేక అధికారులు రైతు సదస్సు ఏర్పాటు చేసి ఎరువులు , పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా అందలేదనే ఫిర్యాదు రాకుడదన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, గుంటూరు , తెనాలి ఆర్ డి ఓ లు కే. శ్రీనివాస రావు, శ్రీ రమణి , డిప్యుటీ కలెక్టర గంగరాజు , ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేషశ్రీ, డి. ఆర్. డి. ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, డిపిఓ నాగసాయి , డి ఎస్ ఓ కోమలి పద్మ , సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య , జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పార్థసారధి ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదంపై మంత్రి అనగాని దిగ్భ్రాంతి



- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి..
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)**: తిరుపతి జిల్లాలోని కడప – చెన్నై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రమాద బాధితులకు అవసరమైన సహాయం అందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## రైతుల ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలి : మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)**: తెనాలి నియోజకవర్గ రైతుల ట్రాక్టర్ల ర్యాలీలో రైతు అభిమానులందరూ పాల్గొనాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర కోరారు.
స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూఅన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండవ ఏడాది మొదటి విడత నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన సందర్భంగా రేపు 23 తేదీ మంగళవారం తెనాలిలో రైతులు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించటం జరుగుతుందని వారు తెలిపారు. సాయంత్రం. 3:30 లకు మార్కెట్ యార్డు నుండి ఓవర్ బ్రిడ్జి మీదుగా యడ్ల లింగయ్య పెట్రోలు,లక్ష్మీ డీలక్స్ రోడ్ నుండి రజక చెరువు,గాంధీ చౌక్ మీదుగా బోసు రోడ్డులోని చిట్టి ఆంజనేయ స్వామి గుడి వరకు ర్యాలీ జరుగుతుందని, కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, తెనాలి టిడిపి ఇంచార్జీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు లు పాల్గొంటారని ఎవరు తెలియజేశారు .ర్యాలీ కార్యక్రమంలో రైతులు,కౌలు రైతులు, రైతు కూలీలు అభిమానులు,ప్రజలు పాల్గొనాలని పిలుపిచ్చారు. సమావేశంలో రైతు నాయకులు ఈదర పూర్ణచంద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్,భీమవరపుకోటిరెడ్డి,మల్లవరపు విజయ్,యనమల అనిత తదితరులు పాల్గొన్నారు.

## భాజపా ఎస్సీ మోర్చా సీనియర్ నేత యలశిల శ్రీనివాసరావుకు కన్నీటి నివాళి



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)**:భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు యలశిల శ్రీనివాసరావు హఠాన్మరణంతో పార్టీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. ఆయన అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, శ్రీనివాసరావు జీవితాంతం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన ప్రజానాయకుడని పేర్కొన్నారు. బీజేపీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ మోర్చా విస్తరణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.
దళిత సామాజిక వర్గాల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పనిచేసిన శ్రీనివాసరావు మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.
యలశిల శ్రీనివాసరావు భౌతికకాయాన్ని బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు.
అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు.

## ఏపీ స్టేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీని బదిలీ చేస్తూ ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ బదిలీకి కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యువజన, అభ్యుదయ, పర్యాటక ఒ సాంస్కృతిక శాఖ పరిధి నుంచి సైన్స్, టెక్నాలజీ ఒ ఇన్నోవేషన్ శాఖకు అకాడమీని బదిలీ చేసింది. అకాడమీ సమర్థవంతమైన నిర్వహణ, మెరుగైన సమన్వయమే లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ తీసుకుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 73ని జారీ చేసింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమావళి-2018 రెండో షెడ్యూల్‌లో సవరణలు చేసింది.
తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తాజా ఆదేశాలతో పరిశోధన, ఆవిష్కరణలకు సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ మరింత ఊతమివ్వనుంది. శాఖల మధ్య సమన్వయం పెంపుతో అకాడమీ పని తీరు మెరుగుపడుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పరిపాలనా పునర్వ్యవస్థీకరణ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

## జాతీయ రహదారులు, ప్రధాన జంక్షన్లలో చెత్త వేస్తే కఠిన చర్యలు

- ప్రజారోగ్య అధికారులకు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వీస్ రోడ్లు, నగరంలోని ప్రధాన జంక్షన్లలో వ్యర్థాలను పారబోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం చిలకలూరిపేట వై జంక్షన్ నుంచి కాకాని రోడ్ వై జంక్షన్ వరకు ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.
జాతీయ రహదారుల పక్కన, సర్వీస్ రోడ్లలో రహస్యంగా చెత్త, ఇతర వ్యర్థాలను పారబోసే వారిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, వాహనాలు, సామగ్రి అందుబాటులో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో పనితీరు కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
నగర సుందరీకరణకు భంగం కలిగించేలా ప్రభుత్వ, ప్రైవేటు గోడలు, ఫ్లైఓవర్ పిల్లర్లపై అనుమతి లేకుండా పోస్టర్లు అంటించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు.
సర్వీస్ రోడ్ల వెంబడి మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని, రోడ్లపై నీరు నిల్వకుండా జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.
పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డీఈఈలు వెంకటరమణ, హనీఫ్, ఎస్ఎస్‌లు రాజేష్, ఐజాక్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్

- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.
గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందన్నారు. ప్రతి ఫిర్యాదుపై క్షుణ్ణంగా విచారణ జరిపి న్యాయమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు.
పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కార అనంతరం సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి వారి అభిప్రాయం తీసుకోవాలని, ఫిర్యాదుదారులకు తెలియజేయకుండా ఎలాంటి కేసును ముగించవద్దని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్, గుంటూరు ఆధ్వర్యంలో స్వామి జ్ఞాన ప్రసన్న నేతృత్వంలో సుమారు 200 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, వృద్ధులు, పేదలకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా నిలిచిందని ఎస్పీ తెలిపారు. సామాజిక సేవలో భాగస్వామ్యమైన ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు.
కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి, ఏ. హనుమంతు, డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుంటూరులో మాతృ మరణాలపై సమీక్ష



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మి, అధ్యక్షతన, తన కార్యాలయంలో సోమవారం,సబ్ డిస్టిక్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశము నందు, మే నెలలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో జరిగిన -2 మాతృమరణాల పై( నుదురుపాడు-1 మరియు జాగర్లమూడి-1) సమీక్ష సమావేశమును నిర్వహించినారు. ఈ సమావేశంలో, మాతృ మరణాలను నివారించడానికి, ఆరోగ్య సంరక్షణ నాణ్యతను మెరుగుపరచడానికి మరియు మరణ కారణాలను విశ్లేషించడం జరిగింది, ఈ రెండు మాతృ మరణాలు నివారించదగినవని కమిటీ సభ్యులు తీర్మానించినారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ, క్షేత్రస్థాయి సిబ్బంది, వివాహ వయస్సు విషయంలో, ఆడపిల్లలకు 18 సంవత్సరాలు మరియు మగ పిల్లలకు 21 సంవత్సరాలపై ప్రజలలో సామాజిక కోణంలో అవగాహన కల్పించడం, వీలైనంత త్వరగా గర్భిణీలను గుర్తించి,నమోదు చేయడం,ప్రమాదకరమైన గర్భిణీ స్త్రీలను, ముందుగా గుర్తించి, అవసరాన్ని బట్టి పై స్థాయి ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయాలని, వారు కాన్పు అయ్యేంతవరకు, సకాలంలో, వైద్య సేవలు , సలహాలు, అందిస్తూ, తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలియజేసినారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలలో రక్తహీనత నివారణ చర్యలు, ధనుర్వాత నిరోధక టీకాలు, ప్రతి నెల జరిగే ప్రధానమంత్రి మాతృత్వ, సురక్షిత యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈసీజీ మరియు స్కానింగ్ సేవలను వినియోగించు కోవాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మాతృమరణాల జిల్లా నోడల్ అధికారి డాక్టర్. ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ రంగారావు, డి సి హెచ్ ఎస్, డాక్టర్ అనురాధ ఇన్చార్జి హెచ్వోడి గైనకాలజీ, డాక్టర్ రామకృష్ణ న్యూరాలజిస్ట్, డాక్టర్ ఆదిత్య ప్రవీణ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఈ అన్నపూర్ణ, డాక్టర్ డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీధర్,డా. ప్రియాంక, డిపిహెచ్ఎన్ఓ ఇన్చార్జ్, శ్రీ బి శివసాంబిరెడ్డి డెమో, ప్రైవేట్ వైద్యులు మరియు సూపర్వైజర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో గడువు దాటితే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ హెచ్చరిక



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో ప్రభుత్వం నిర్దేశించిన గడువు దాటితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ హెచ్చరించారు.
సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంతృప్తే అర్జీల పరిష్కారంలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన దరఖాస్తులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉంచకుండా, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఏదైనా అర్జీ ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ఎల్ఏ గడువు దాటితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.
దివ్యాంగులు, వృద్ధులు అందించే అర్జీల విషయంలో కలెక్టర్ స్వయంగా వారి వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.
కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి పి. శేషశ్రీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె. వి. వి. సత్యనారాయణ, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్రబాబు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)**: మండల పరిధిలోని జగ్గడిగుంట పాలెం గ్రామానికి చెందిన పోతురాజుకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 49,319 ఆర్థిక సహాయం మంజూరైంది.
తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవతో ఈ సహాయం మంజూరైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన రూ. 49,319 చెక్కును టీడీపీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, మల్లవరపు విజయ్ కుమార్, కన్నయ్యలు బాధిత కుటుంబానికి అందజేశారు.
ఆపద సమయంలో ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పోతురాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు ప్రజలు సహకరించాలి



- ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి బీఎల్ఓలకు అందించాలి
- గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ విజ్ఞప్తి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియకు నగర ప్రజలు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె. మయూర్ అశోక్ కోరారు.
సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తున్నారని తెలిపారు. ఓటర్లు ఆ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు అందించాలని సూచించారు.
ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలు డిజిటలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మొత్తం 2,52,062 మంది ఓటర్లకు గాను 1,77,370 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇది 70.37 శాతమని, ఇప్పటివరకు 1,537 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,78,555 మంది ఓటర్లకు గాను 2,00,384 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశామని, ఇది 71.94 శాతమని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1,533 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు.
ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా పూర్తి చేసి బీఎల్ఓలకు అందించాలని కమిషనర్ కోరారు. సరైన, తప్పులులేని ఓటరు జాబితా తయారీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎం చంద్రబాబుకు "భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా" పుస్తకం బహూకరణ



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** భారతదేశ అభివృద్ధి ప్రస్థానం, పరివర్తన, ప్రపంచ వేదికపై దేశం సాధిస్తున్న ప్రగతిని ప్రతిబింబించే "భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా" పుస్తకాన్ని ప్రముఖ రచయిత, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి కిలారి దిలీప్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బహూకరించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధించిన అభివృద్ధి, సాంకేతిక రంగంలో పురోగతి, మౌలిక వసతుల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠ పెరుగుదల వంటి అంశాలను ఈ పుస్తకంలో వివరించినట్లు రచయిత తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుస్తకాన్ని పరిశీలించి రచయిత కిలారి దిలీప్‌ను అభినందించారు. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని విశ్లేషణాత్మకంగా వివరించేలా ఈ గ్రంథం రూపొందించారని, వివిధ రంగాల్లో భారత్ సాధించిన మార్పులు, విజయాలను పాఠకులకు పరిచయం చేస్తుందని పేర్కొన్నారు.

భారతదేశం ప్రపంచ నాయకత్వ దిశగా ముందుకు సాగుతున్న తీరు, అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలను అర్థం చేసుకునేందుకు ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

"భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా" పుస్తకం ద్వారా దేశ అభివృద్ధి గమనాన్ని, విధానపరమైన మార్పులను ప్రజలకు చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నామని

## పుల్లంపేట రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- వైద్యులు, అధికారులతో మాట్లాడిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా పుల్లంపేట సమీపంలో జరిగిన లారీ–ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వైద్యులు, అధికారులతో మాట్లాడారు.

ెో వ ు ఎా ం ౦ ం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన 15 మందికి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. వారిలో 17 ఏళ్ల బాలిక చికిత్స కోసం తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

మరో ఇద్దరు క్షతగాత్రులు రాజంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారని, వారి ఆరోగ్యం మెరుగుపడటంతో సోమవారం ఉదయం డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ క్షతగాత్రులకు అవసరమైన వైద్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. మెరుగైన చికిత్స కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఈ నెల 28న పల్స్ పోలియో



- ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు
- పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి
- జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ పిలుపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లాలో జాతీయ పల్స్ పోలియో టీకా కార్యక్రమం ఈ నెల 28 ఆదివారం నాడు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ తెలిపారు.

జిల్లాలో సున్నా నుండి 5 సంవత్సరాల వయస్సు గల 1,44,673 మంది చిన్నారులను లక్ష్యంగా నిర్దేశించగా, అందులో 1,42,336 మంది పిల్లలు మరియు 2,337 మంది వలస చిన్నారులు ఉన్నారన్నారు. ప్రత్యేక దృష్టి అవసరమైన 384 హై రిస్క్ ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు 7 కోర్ గ్రూప్ అధికారులు, 913 టీకా కేంద్రాలు, 78 మొబైల్ బృందాలు, 156 రూట్లలో 156 రూట్ సూపర్‌వైజర్లు ఏర్పాటు చేయగా, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలకు కలిపి 4,012 మంది వ్యాక్సినేటర్లు సేవలు అందించనున్నారని తెలిపారు. ప్రయాణికులు, వలస కుటుంబాల పిల్లలకు టీకాలు అందించేందుకు జిల్లాలో 24 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశామని, అలాగే ప్రతిపాడు, పొన్నూరు, కొల్లిపర, తెనాలి ఆసుపత్రి, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి, డీవీఎస్ గుంటూరు కేంద్రాల్లో మొత్తం 6 బఫర్ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారన్నారు.

జిల్లాలోని ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం కోసం జిల్లాకు 2,57,980 ఓపీవీ డోసులు (12,899 వయల్స్) అవసరమవుతాయని అంచనా వేయగా, జూన్ 19 నాటికి 2,16,000 డోసులు అందుబాటులోకి వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డా. విజయలక్ష్మి తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టరట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో పల్స్ పోలియో ప్రత్యేక గోడ పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డి ఆర్ ఓ ఖాజావలి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. దుర్గా ప్రసాద్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా శ్రావణ్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** సమాజానికి అవసరమైన సేవలను అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో 26 మంది చిరు వ్యాపారులకు తోపుడుబండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని అన్నారు.

ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ రోటరీ క్లబ్ సమాజాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తోందని తెలిపారు. చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా తోపుడుబండ్ల పంపిణీ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాలడుగు సురేంద్ర, రోటరీ డిస్టిక్ 3150 అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, రోటరీ నాయకులు కన్నెగంటి మురళీకృష్ణ, ధూళిపాళ్ల రవీంద్రనాథ్, చేతన్ రాజ్ కొటారి, కేసన కోటేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పార్థసారథి




**ఏలూరు/బుట్టాయిగూడెం (జర్నలిస్ట్ ఫైల్):** దేశ సంపదను కాపాడే గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుట్టాయిగూడెం మండలం కోట రామచంద్రపురం ఐటీడీఏ కార్యాలయంలో పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలకు పూర్వవైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పూర్తయిన పనులు, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమీక్షించారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. గిరిజన కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను స్వర్ణగ్రామ సచివాలయాల్లో ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని తెలిపారు. గిరిజనులకు రాజ్యాంగ హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని విస్తరించాలని, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, జాబ్ మేళాల ద్వారా ఉపాధి కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు రోటరాక్ట్ జిల్లా స్థాయి అవార్డు

- బెస్ట్ న్యూలీ చార్టర్డ్ క్లబ్ అవార్డు కైవసం




**మంగళగిరి , (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు రోటరాక్ట్ కార్యకలాపాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి ప్రతిష్ఠాత్మక అవార్డును సాధించారు.

రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ అవుట్‌స్టాండింగ్ అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో కళాశాల రోటరాక్ట్ క్లబ్‌కు బెస్ట్ న్యూలీ చార్టర్డ్ క్లబ్ అవార్డు లభించింది.

ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాములరెడ్డి, ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్ విద్యార్థులను, రోటరాక్ట్ సభ్యులను అభినందించారు.

రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షురాలు జె. కేదారేశ్వరి, కార్యదర్శి బి. సంజన, సభ్యులు సి. హెచ్. నాగేశ్వరరావు, ఎం. రవి తదితరులు కళాశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకురావడం పట్ల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

2025--26 రోటరీ సంవత్సరంలో కళాశాల రోటరాక్ట్ క్లబ్ నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, మానవతా సేవలను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు తెలిపారు.

ఈ అవార్డు విద్యార్థుల్లోని నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవా దృక్పథానికి నిదర్శనమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా విద్యార్థులు సమాజ సేవలో మరింత చురుకుగా పాల్గొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ అవార్డును డిస్ట్రిక్ట్ రోటరాక్ట్ రిప్రెజెంటేటివ్ ఆర్‌టీఆర్ వంశీ వినోద్ కుమార్ అందజేశారు. సేవా కార్యక్రమాల అమలులో నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ రోటరాక్ట్ క్లబ్ ఆదర్శంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలని ఫ్యాప్టో డిమాండ్

- జూలై 14న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, పికెటింగ్‌కు పిలుపు
- ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు అందించాలని నిర్ణయం




**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని, విద్యాహక్కు చట్టంలో అవసరమైన సవరణలు చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది.

ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ, జూన్ 22 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలు అందించాలని ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు వెల్లడించింది.

చట్ట సవరణ జరిగే వరకు ఇన్ సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరనున్నట్లు తెలిపింది.

ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ ఉత్తీర్ణత కోసం అదనపు సమయం కేటాయించి ప్రిపేర్ కావాల్సి వస్తోందని, దీనివల్ల బోధనా కార్యక్రమాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఫ్యాప్టో పేర్కొంది. టెట్ పాస్ మార్కులు అందరికీ ఒకే విధంగా ఉండాలని, సిలబస్ కూడా ఉపాధ్యాయులు బోధించే అంశాలకు అనుగుణంగా ఉండాలని కోరింది.

ఉద్యోగుల సమస్యలు, 12వ వేతన సవరణ, 30 శాతం మధ్యంతర భృతి తదితర విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జూలై 14న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, పికెటింగ్ నిర్వహించాలని ఫ్యాప్టో నిర్ణయించినట్లు ప్రకటించింది.

ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి, కో చైర్మన్ సీహెచ్. రమేష్ బాబు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కె. బసవలింగారావు పాల్గొన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడం కొంతమంది రాజకీయ పార్టీల విధానంగా మారిందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఇకపై నమ్మబోరని అన్నారు.

గతంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా పయనిస్తున్న సమయంలో కూడా తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. అసత్య ప్రచారాల ఆధారంగా రాజకీయాలు చేసే విధానాన్ని ప్రజలు గమనించారని, గత పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు పనిచేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే, కొంతమంది కులాల పేరుతో వివాదాలు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఏ ఘటన జరిగినా దానికి కుల రంగు పులమడం బాధాకరమన్నారు.

గతంలో జరిగిన పలు ఘటనల సమయంలో కులాల గురించి మాట్లాడని వారు ఇప్పుడు కులాల పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, నేరాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి చెప్పారు. గంజాయి, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు.

కల్తీ మద్యం వంటి ఘటనలపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకుని బాధ్యులపై కేసులు నమోదు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రజల భద్రత, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## కుమార్తె వివాహానికి సీఎంకు ఆహ్వానం పలికిన టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఆయన సతీమణి రేఖ మరియు తనయుడు యువనేత గుడిపల్లి పృథ్వీ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుపతిలో జూలై 2వ తేదీన జరగనున్న తమ కుమార్తె వైష్ణవి – హర్షవర్ధన్‌ల వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తూ వివాహ శుభలేఖను అందజేశారు. కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు.

## ఓటు హక్కు ఎంతో విలువైనది : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్ ప్రాంతంలో 28, 29 వార్డుల్లో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆయన ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని ఎమ్మెల్సీ ఆలపాటి సూచించారు. కుటుంబంలో మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, కొత్తగా ఓటు హక్కు పొందాలనుకునే వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితా సక్రమంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ అభివృద్ధికి అండగా నిలుస్తాం



- రూ.18.5 లక్షలతో సౌచాలయాల ఏర్పాటు
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రీయ విద్యాలయం ను ఆధునీకరించటానికి అన్నీ విధాలా అండగా నిలుస్తామని సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. సెంట్రల్ ట్యాక్స్ శాఖ స్వచ్ఛతా నిధులతో నల్లపాడు కేంద్రీయ విద్యాలయంలో సరికొత్త హంగులతో, అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన సౌచాలయాలను సోమవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ అభియాన్ లో భాగంగా విద్యాలయంలో శిధిలావస్థ లో ఉన్న మరుగుదొడ్లు ను రూ. 18.5 లక్షల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో పూర్తి స్థాయి లో పునరుద్ధరించామన్నారు. ఈ ప్రాజెక్టు లో భాగంగా పాఠశాలలో మూడు అంతస్తులలోని ఆరు బ్లాకులలో బాలురు, బాలికల కోసం అత్యాధునిక ప్రీమియం నాణ్యతతో నిర్మించడం జరిగిందన్నారు. అందరికీ సమాన హక్కు కల్పించే లక్ష్యంతో, దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేక సౌచాలయం నిర్మాణానికి ఈ ప్రాజెక్ట్ లో ప్రాధాన్యత ఇవ్వబడిందన్నారు. ఆధునిక పారిశుధ్య సౌకర్యాల వల్ల పాఠశాలలో పరిశుభ్రత మరియు మౌలిక వసతులు మెరుగుపడ్డాయని తెలిపారు.

విద్యాలయాలలో మౌలిక సౌకర్యాలను మెరుగు పరచడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత గా భావించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ప్రిన్సిపాల్ బొంత శేఖర్ మాట్లాడుతూ.. స్వచ్ఛత నిధులతో తమ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తోలుత కమిషనర్ కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు, ఎన్.సి.సి క్యాడెట్లు, స్కౌట్ అండ్ గైడ్స్ ఘన స్వాగతం పలికారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్ హెచ్చరిక

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంపై అధికారులు త్వరితగతిన స్పందించాలని, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ హెచ్చరించారు. సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా అందిన అర్జీలను కేవలం రికార్డుల్లో పరిష్కరించినట్లు చూపకుండా, క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి మౌలిక సమస్యలపై తక్షణ స్పందన ఉండాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 44 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 17, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 4, యూపీఏ సెల్‌కు 2, అకౌంట్స్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467